PRAMUKHANDHRA 32nd Year of Publication We carry the news and views of Telugus

32 వ సంవత్సరం

# ప్రముఖాంధ్ర



వ్యవస్థాపకులు
శ్రీ గోటేటి శ్రీరామారావు

₹.15
ఫిబ్రవరి 2026



THE ONE AND ONLY TELUGU MAGAZINE CIRCULATED IN USA, UK, CANADA, GERMANY, AUSTRALIA, MAURITIUS, SOUTH AFRICA, UAE, KUWAIT, SINGAPORE, MALAYSIA & ALL OVER INDIA


అజంతా
సుగంద వక్క పలుకులు
సంప్రదాయ తాంబూల వక్కపలుకులు
Ajantha Dr. K. Sankar Rao
IVF-TN STATE
VIBHAG PRESIDENT
Srimathi. Vijayalakshmi Sankar Rao
Ex-State President
Tamilnadu Arya Vysya Mahila Vibhag
கோமாதா
விஸ்வமாதா
"సర్వేజనా సుఖినో భవంతుః"
AJANTHA
SUGANDHI SUPARI
TRADITIONAL THAMBULA BETEL NUT PIECES
அஜந்தா
சுகந்த பாக்கு
சம்பிரதாய தாம்பூல பாக்கு
అజంతా
సుగంద వక్క పలుకులు
సంప్రదాయ తాంబూల వక్కపలుకులు




# ప్రముఖాంధ్ర

ప్రపంచ తెలుగుల మానస పత్రిక

ఫిబ్రవరి 2026

సంపుటి : 32 (374) సంచిక : 2




## జంబూ ద్వీపం ఒక వైపున ఉంటే, క్రౌంచ ద్వీపం మరొక వైపున వుంది! చిరకాలం నుండి వీటి మధ్య రాకపోకలున్నాయి?-

ఎలా వున్నాయి ? ఎందుకున్నాయి? ఎవరు రాకపోకలు సాగించారు ? అనే మూడు ప్రశ్నలకు త్రికాలజ్ఞులైన భారత మహర్షులు సోదాహరణంగా సమాధానములిచ్చారు!!

ఆర్య చరిత్ర ఐదువేల సంవత్సరములుగా ఉన్నదని చెబుతూ వుంటారు. లక్షలాది సంవత్సరాలని కొందరు అంటూ వుంటారు. ఎవరు ఎలా వ్యాఖ్యి కరణం చేసినప్పటికిని లక్ష సంవత్సరాల చరిత్ర, సంస్కృతి ఆర్య చరిత్రను ప్రభవింప చేస్తున్నది. ప్రభావం కనిపిస్తూనే వున్నది. ఈ సాగరాలు ఖండాలు లేకుండా భరత దేశం ఏక ఖండంగా , భరత వర్షంగా వర్ధిల్లినది. ఒక పార్శ్వన జంబూ ద్వీపం , మరో పార్శ్వనా క్రౌంచ ద్వీపము ఉన్నాయని , వీటి మధ్య చరిత్రకారులు పర్యటిస్తూండేవారని అంటూంటే – మరి కొందరు భువి అంతా ఏక ఖండ భూఖండమని సగరపుత్రులు కనిపించని యాగాశ్వం కోసం భువిని త్రవ్వుకుంటూ పోయారని , వారి కారణంగానే సాగరాలు (మహా సముద్రాలూ ) ఏర్పడ్డాయని అంటారు.

ఈ అనంత శ్రేణుల మధ్యనున్న జల శ్రేణులే సాగరాలని ఇతిహాసికులు చెప్పేది అసత్యమెలా అవుతుంది.

ఇతిహాసము అంటే జరిగినది చెప్పడమే కదా!

కొలంబస్ దేశాలను కనిపెట్టాడని , వాస్కోడిగామా దేశాల సంచారం చేసాడని చెబుతారు . అంతక్రితమే భారతీయులు సంచారం చేసారు. అంతరిక్షయానం చేసారు. పుష్పకవిమానయానం చేసారు. సాగరంలో వారధులు కట్టారు. శ్రీ రాముడు లంకా యానం వారధి గుండానే చేసాడు. ఈ విషయాన్ని కట్టు కథని అన్నారు మన దేశ నాస్తికులు. నాసా వారు చెప్పే వరకు నమ్మ లేదు – అంటే బయట వారు చేపితినే మనం నమ్ముతాం. మన వారు మన దేశం మనం అంటే గౌరవం నమ్మకం పెంచుకోవాలి. ఇవి కథలు కావు చరిత్ర అని నమ్మాలి.

జై హింద్ ! జై భారత్ !!



బుధజన విధేయుడు

– గోటేటి శ్రీ రామారావు

ప్రముఖాంధ్ర, జూలై 2018


Founder Editor : **GOTETI SRI RAMA RAO**, Editor : **GOTETI VENKATESWARA RAO**
Printed, Published & Owned by **G.V.RAO**, Associate Editor
at **GOTETI GRAPHICS**, 16 (64), Thambiah Reddy Road, West Mambalam, Chennai - 33.
Phone : 91-44-24742091, 91-44-23716322, 91-44-24894145 - Tele Fax : 91-44-23716322
**www.pramukhandhra.org/E.mail : pramukhandhra95@gmail.com**
**YEARLY SUBSCRIPTION : RS. 216/- PROMOTERS SUBSCRIPTION : RS. 2116/-**

# టీ ఆర్ మాలి



టీ ఆర్ మాలి గా ప్రఖ్యాతి గాంచిన తిరువిడై మరుదూర్ రామస్వామి మహాలింగం తమిళనాడులోని తంజావూర్ జిల్లాలో తిరువిడై మరుదూర్ గ్రామంలో నవంబర్ 6, 1926 న రామస్వామి అయ్యర్, బ్రహదాంబాల్ దంపతులకి జన్మించాడు. వారి గ్రామం లోని శివాలయం లోని మహాలింగస్వామి గుర్తుగా తమ కుమారుడికి మహాలింగం అని ఆదంపతులు నామకరణం చేశారు.

మహాలింగం కి మూడేళ్ళ ప్రాయం లో వారి కుటుంబం తిరుచ్చిరాపల్లి కి మకాం మార్చారు. తమ సంతానం అందరికీ తమ బంధువు అయిన సంగీత విద్వాంసులు జల్ర గోపయ్య అయ్యర్ వద్ద సంగీతం నేర్పించారు. మహాలింగం సోదరుడు గౌతమ్ వేణుగానాన్ని అభ్యసించగా, అప్పట్లో మహాలింగం ఆరోగ్యం అంతగా బాగుండకపోవడంతో అతను కర్ణాటక సంగీత గాత్ర విద్యని అభ్యసించాడు.  కానీ మహాలింగం వేణుగానం పట్ల ఆకర్షితుడై పెద్దలకి తెలియకుండా స్వయంగా వేణుగాన సాధన చేయటం మొదలుపెట్టాడు.

గురువు గోపాల అయ్యర్ వేణుగాన సాధన పట్ల మహాలింగానికి గల ఆసక్తిని గమనించి అతని తండ్రికి ఈ విషయం చెప్పి మహాలింగానికి వేణుగాన సంగీతాన్ని నేర్పిస్తే బాగుంటుందని హితబోధ చేసాడు. కానీ కొడుకు ఆరోగ్య రీత్యా వేణుగాన సంగీతాన్ని నేర్పిస్తే ఇబ్బంది పడతాడని ఆయన సందేహించాడు. ఒకరోజు తన కుమారుడు భైరవి రాగంలో విరిబోణి వర్ణాన్ని తారా స్థాయిలో వేణువు మీద అలవోకగా పలికించగా, ఆలకించిన తండ్రి గోపాల అయ్యర్ సలహాకి తన అంగీకారం తెలిపాడు. (విరిబోణి వర్ణాన్ని 18 వ శతాబ్దానికి చెందిన తంజావూర్ లోని మరాఠా రాజుల ఆస్థాన సంగీత విద్వాంసుడు పచ్చిమిరియం ఆది అప్పయ్య స్వరపరచాడు. కర్ణాటక సంగీతానికి త్రిమూర్తులలో ఒక్కరైనా శ్యామ శాస్త్రి పచ్చిమిరియం ఆది అప్పయ్య గారి శిష్యుడు.)

అనేక నగరాలలో సంగీత సమ్మేళనాలలో పాల్గొని మాలి తన వేణు గానంతో సంగీత ప్రియులని అలరింపచేసాడు. క్రమేపి కుటుంబ ఆర్థిక బాధ్యత మొత్తం మాలి చిన్ని భుజాల మీద పడింది. తండ్రి మాలి ని విజయనగరం మహారాజా వారి సంగీత కళాశాలకు తీసుకుని వెళ్ళాడు. అప్పట్లో ప్రఖ్యాత వాయులీనం విద్వాంసులు ద్వారం వెంకటస్వామి నాయుడు గారు ఆ సంగీత కళాశాలకు ప్రిన్సిపాల్ గా ఉండేవారు.  బాలుడు బాగా చిన్నవాడు అవటంతో ద్వారం వారు మాలి ని సంగీత కళాశాలలో విద్యార్థిగా చేర్చుకోలేదు. కానీ ఆయన మాలి ని ఎంతో ప్రోత్సహించి, మాలి చేసిన కచేరీలలో పక్కవాద్యంగా స్వయంగా వాయులీనం, కంజీర వాయించారు.

మాలి తన తొలి సంగీత కచేరీ 1933 లో త్యాగరాజ ఉత్సవాలలో భాగంగా రసిక రంజని సభ, మైలాపూర్, మద్రాసు లో తన ఏడేళ్ల ప్రాయం లో చేసాడు. అచిరకాలం లోనే మహామహులయిన చౌడయ్య, వెంకటరామయ్య (వాయులీనం విద్వాంసులు), కుంభకోణం అళగియ నంబి పిళ్ళై, తంజావూర్ వైద్యనాథ అయ్యర్ (మృదంగ విద్వాంసులు) వంటి వారికి పక్క వాద్యంగా తన వేణుగానాన్ని అందించాడు.

తరువాత కాలం లో మాలి మృదంగ విద్వాంసులయిన పాలఘాట్ మణి అయ్యర్, పళని సుబ్రహ్మణ్యం పిళ్ళైలకి తన వేణుగానం తో వాద్య సహకారం అందించాడు.  మాలి వేణుగాన కచేరి లో సుప్రసిద్ధ కర్ణాటక సంగీత గాత్ర విద్వాంసులయిన చెంబై వైద్యనాథ భాగవతార్ స్వయంగా వాయులీనం వాయించారు. అదేవిధంగా మరో సుప్రసిద్ధ కర్ణాటక సంగీత గాత్ర విద్వాంసులు మహారాజపురం విశ్వనాథ అయ్యర్ మాలి కి కచేరీలో మృదంగం వాయించి సహకరించారు. " మృదంగం మీద నా చేతి వేళ్ళకి పని పెట్టాలంటే అది కేవలం మాలి వల్లనే సాధ్యమవుతుంది " అనేవారు మాలి చిరకాల మిత్రుడు, మరియు అతనికి సుదీర్ఘంగా కచేరీల్లో మృదంగం వాయించిన పాలఘాట్ మణి అయ్యర్.

మాలి బాల్యం నుంచే ఏక సంథాగ్రాహి. ఏ కీర్తననైనా ఒకసారి వింటే ఇట్టే పట్టేయగలడు. మాలి కి పూర్వం వేణుగానం చేసే విద్వాంసులు అందరూ ఒక పద్ధతిలో ఒకే మూసలో కచేరి చేసేవారు. మాలి రాకతో ఒకే మూసలో కచేరీ చేసే విధానానికి మంగళం పలికి గమకాలతో వేణుగానం చేసే కొత్త పద్ధతి మొదలయ్యింది. దానితో గాత్రం తో సమానంగా వేణుగానం స్థానాన్ని సంపాదించుకుంది. దానితో పాటు సంగీత కచేరీలలో పక్క వాద్యం గా వున్న వేణువు ప్రధాన వాద్యంగా ఎదిగింది. తనకు శ్వాశ మీద వున్న పట్టుతో మాలి ఒక స్వరాన్ని వేణువు మీద నలభై సెకన్ల కాలం వరకు ఆలపించేవాడు. అలా ఆలపించమే కాకుండా వెనువెంటనే తన వేణుగానాన్ని ఆపకుండా కొనసాగించేవాడు కూడా!

శ్వాశ మీద పట్టు చేత మాలి తన వేణుగానం లో స్వర స్థాయిలో, ఆరోహణ, అవరోహణల్లో ఎక్కడ ఒడిదుడుకులు లేకుండా సునాయాసంగా లయబద్ధంగా వాయించేవాడు. మాలి వేణువుని వేళ్ళతో ఒడుపుగా పట్టుకునే విధానం,ముఖ్యంగా తన ఎడం చేత్తో వేణువుని ఒడిసి పట్టుకునే పద్ధతి ఒక ప్రత్యేక శైలిలో చిలుక ఆకారంలో వుండి , దానికి "చిలుక పట్టు" అని పేరు వచ్చింది. తద్వారా మాలి వేణువు మీద పూర్తి పట్టుని సాధించాడు. నిరాటంకంగా, ప్రవాహంలా సాగే మాలి వేణుగానం, గమకాలతో కూడి గాయకుడి గాత్రాన్ని పోలి ప్రేక్షకులని రంజింపచేసేది.

మాలి అవలంబించిన ఈ శైలిని అతని శిష్యులయిన దిండిగల్ ఎస్ పీ నటరాజన్, టీ ఎస్ శంకరన్, యెన్. రమణి, బీ యెన్ సురేష్, ప్రపంచం సీతారాం తదితరులు కొనసాగించారు.

మాలి తన వేణువుకి మందమైన వెదురు బద్దలపై చిన్న రంధ్రాలని చేయించటంతో వేణుగానం మంద్ర స్థాయి లో ఉన్నప్పటికీ శ్రవణానందకరంగా, స్పష్టంగా, మంచి గాత్ర సంపదతో కూడి శ్రోతల్ని అలరింపచేసేది.

సాధారణంగా వేణువు కి ఏడు రంధ్రాలు ఉంటాయి. కానీ మాలి తన వేణువుకి ప్రత్యేకంగా ఎనిమిది రంధ్రాలు చేయించేవాడు. దరిమిలా వేణువుని బాగా గట్టిగా గాలి వదిలి వాయించవలసి వచ్చేది. ఈ పద్ధతినే మాలి ఇష్టపడేవాడు. " తన వేణువులో అదనంగా గల ఎనిమిదవ రంధ్రం ఆధారంగా మాలి వేణుగానంలో ప్రత్యేకమైన పట్టుని, విలక్షణమైన శైలిని సాధించాడు. " అని సంగీత శాస్త్రజ్ఞుడు ప్రొఫెసర్. పీ. సాంబమూర్తి కొనియాడారు.

మాలి వేణువు మీద చేసిన పరిశోధనలు, ప్రయోగాలు సంప్రదాయ పద్ధతుల ఛట్రం లో బంధింపబడిన వేణువుని ఆ పరిధులనుంచి వెలుపలికి వచ్చి సృజనాత్మకతని అందిపుచ్చుకునేట్టు చేశాయి.

మాలి వాయులీనం లో కూడా నిష్ణాతుడు. చెంబై వైద్యనాథ భాగవతార్ గారి ఒకానొక గాత్ర కచేరీలో మాలి ఆయనకి పక్కవాద్యంగా వాయులీనం వాయించాడు. 1955 లో మాలి బెంగళూరు కి మకాం మార్చిన తరవాత 1958 లో దాదాపు అజ్ఞాతం లోకి వెళ్ళిపోయాడు.

మాలి కి పదహారేళ్ళ ప్రాయంనుంచే తరచూ తలనొప్పి వచ్చేది. అది అతనిని చివరివరకు అంటిపెట్టుకునే వుంది. దానికి తగినట్టు మాలి చాలా సందర్భాలలో ఒప్పుకున్న కచేరీలకి హాజరయ్యేవాడు కాడు. ఇది కచేరీ నిర్వాహకులకు ఇబ్బందికరంగా మారేది. వీటన్నింటికి తోడు మాలి మద్యానికి బానిసయ్యాడు.

పాఠశాల చదువు పెద్దగా లేకపోయినప్పటికీ మాలి ఆంగ్ల భాష పై మంచి పట్టుతో పాటు ఆంగ్ల సాహిత్యం పట్ల ఆసక్తిని కలిగి ఉండేవాడు. గణిత శాస్త్రం పైన మాలి కి మంచి అవగాహన వల్ల అతనికి మానవ కంప్యూటర్ అని శ్లాఘింపబడే శకుంతలా దేవి తో మంచి పరిచయం ఉండేది. వారిద్దరూ కలిసి గణితంలో చాలా పజిల్స్ పరిష్కరించేవారు.

మాలి కి క్యారం బోర్డు, చదరంగం మీద కూడా మంచి ప్రావీణ్యం వుంది. అతను క్రికెట్ వీరాభిమాని. ఆకాశవాణి వారు మాలి కి దేశం లో వున్న తమ ఆకాశవాణి కేంద్రాలలో ఎక్కడైనా ఎంత సమయమైనా వేణుగానం చేసే వెసులుబాటు కల్పించి మాలికి అత్యంత అరుదైన గౌరవాన్ని ఇచ్చారు. మాలి హిందూ వార్తాపత్రికకి తరచూ వ్యాసాలు రాసేవాడు. అతని రాతలుకూడా అతని వేణుగానం లాగా స్వతంత్రంగా, సూటిగా ఉండేవి. ప్రతిభ వున్న వర్ధమాన కళాకారులని ఇట్టే గుర్తించి వారికి తన సహకారం, సహాయం అందించేవాడు మాలి.


1980 నుంచి 1985 వరకు మాలి తన అమెరికన్ భార్య ఎల్లెన్ చాడ్విక్ తో అమెరికాలో నివసించాడు. 1985 లో మరల భారతదేశానికి తిరిగి వచ్చి అనతికాలం లోనే 31, మే, 1986 న తన యాభై తొమ్మిదవ వయస్సులో మాలి కాలం చేసాడు.

తన మరణానికి కొంతకాలం ముందు జనవరి, 1986 లో భారత ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకమైన పద్మ భూషణ్ బిరుదు తో సత్కరింప బోగా, దానిని సున్నితంగా మాలి తిరస్కరించాడు. బహుముఖ ప్రజ్ఞాశాలి, స్వతంత్ర భావాలతో పాటు అసాధారణ వ్యక్తిత్వం కల మాలి మరణించినప్పటికీ అతని అపారమైన తరగని సంగీత సంపద కర్ణాటక శాస్త్రీయ వాద్య చరిత్రలో చిరస్థాయిగా నిలిచివుంటుందనటంలో సందేహం లేదు.

- డాక్టర్. బీ. యెన్. వీ. పార్థసారధి



## నమస్కారం మన సంస్కారం



తూర్పుదిక్కు కు - నమస్కరిస్తే మన తల్లిదండ్రులకు నమస్కరించినట్లు. మనిషికి తల్లిదండ్రుల ఋణం గొప్పది

పశ్చిమ దిక్కు - నమస్కారం భార్యబిడ్డలపై ప్రేమకు చిహ్నం. భార్యబిడ్డల ఆలనాపాలనా చూడాలి.

ఉత్తర దిక్కు - నమస్కారం బంధుమిత్రుల ఆదరణకు కృతజ్ఞత చెప్పడం. బంధుమిత్రులను ఎప్పడూ దూరం చేసుకోకూడదు.

దక్షిణ దిక్కు - నమస్కరిస్తే గురుపరంపరకు నమస్కరించినట్లు. గురువులను గౌరవించాలి.

భూమికి నమస్కారం చేయడం అంటే సాటివారి ఆదరణకు కృతజ్ఞత తెలపడం.

ఆకాశం వైపు నమస్కరించడం మన పూర్వీకులైన మహర్షులకు, ప్రస్తుత ఉన్న మహాత్ములకు ఆశీస్సులు కోరుతూ, కృతజ్ఞతలు తెలపడం.

అందు వలన రోజూ ఒకసారి స్నానం చేసాక అన్ని వైపులకు తిరిగి నమస్కరించి అందరికీ కృతజ్ఞతలు చెప్పవలెను.


# 'ప్రగతి' హనుమంత రావు

"

నన్నెందుకో ఈ అచ్చుపని ఆకర్షించింది . నన్ను రమ్మని ప్రెస్ చూసుకోమని నాన్నగారు చెప్పక పోయినా నా కున్న అభిరుచి ద్వారా నేనిందులోకి వచ్చాను. ఇంకా ప్రెస్సు లోకి అడుగు పెట్టక మునుపే నాన్నగారితో బి నాగిరెడ్డిగారి చందమామ ప్రెస్ కు వెళ్లి చూసి ఆశ్చర్య పోయాను. నిలువెత్తు బాంబే డైయింగ్ క్యాలెండర్లలోని రంగుల అందాల తారలు రేఖ హేమమాలిని లను వారిని తిన్నగా చూస్తున్నంతగా ఆకర్షణీయంగా అచ్చయి ఉండేవి. ఆ టెక్నాలజీ కి మురిసి పోయే వాడిని. అంత పెద్ద ప్రెస్ కాకపోయినా నాకు ప్రెస్ నడపాలనే ఉత్సాహంతో ఒక ఆఫ్ సెట్ మెషిన్ కొని మా సినీరమ రంగుల సినిమా పత్రిక ను ముద్రించి మురిసిపోయేవాడిని. చెన్నై లో మా గోటేటి గ్రాఫిక్స్ కొంత పేరు సంపాదించుకున్నాను. Chennai లో MPLA మద్రాస్ ప్రింటర్స్ అండ్ లితోగ్రాఫర్స్ అసోసియేషన్ ల సభ్యుడనయ్యి కొంతమంది మిత్రులను సంపాదించుకున్నాను. సరిగ్గా అక్కడే ప్రగతి హనుమంతరావు గారిని కలుసుకున్నాను. నిరాడంబరమైన వ్యక్తి చక్కగా కలుపుగోలుతనంగా పలకరించారు. హైదరాబాద్ వచ్చినపుడు ప్రెస్ కు రమ్మన్నారు . అవకాశం కుదరక కలవలేకపోయాను.

ప్రగతి ప్రెస్ పేరు తెలియని వారు ఉండరేమో , అంతటి పేరు ప్రఖ్యాతులను దేశ విదేశాలలో సంపాదించుకున్న సంస్థ. మొన్న హైద్రాబాదులో ప్రపంచ తెలుగు సమాఖ్య సభలలో వారి కుమారుడు నరేంద్ర గారిని కలిసాను . నన్ను నేను పరిచయం చేసుకున్నాను . ఆ సభలలో "తెలుగుదనం" పుస్తకం ప్రగతిలో అచ్చయి విడుదల అవుతే , ఆ వేదిక మీదే ప్రపంచ తెలుగు సమాఖ్య " ప్రత్యేక సంచిక " సావెనీర్ గోటేటి గ్రాఫిక్స్ లో అచ్చయి విడుదలయ్యింది. ముఖపుస్తకంలో హనుమంతరావుగారి వ్యాసం చూసాక ఆ రచయిత గారి అనుమతితో ఇక్కడ మీకీ సమాచారాన్ని అందిస్తున్నాను. తెలుగువాడిగా తెలుగువాడి గొప్పతనాన్ని వారికీ దక్కిన గౌరవాన్ని, పేరు ప్రఖ్యాతులను అందరికి తెలియ చెయ్యటం లో ప్రముఖాంధ్ర ముందుంటుంది. ఆయన గురించి అందరికి తెలిసిన ఇంకో పదిమందికి తెలియ చేద్దామనే.

- గోటేటి వెంకటేశ్వరరావు "




ఈ రోజు ప్రగతి ప్రింటర్స్ అంటే తెలియని వారు ఉండ రేమో! ఆనాడు కేవలం 12 వేల రూపాయల పెట్టుబడితో పరుచూరి హనుమంతరావు పునాదులు వేసిన 'ప్రగతి' ఇవాళ రూ.200 కోట్ల టర్నో వర్?తో ప్రగతిపథంలో దూసు కెళుతోంది. ఓ పుస్తక ప్రచురణ సంస్థ అధినేతగా ప్రముఖుడైన 'ప్రగతి' హనుమంత రావుగా సుప్రసిద్ధులు.

వ్యాపారానికి మానవీయ విలువలు జోడించడమే ఆయన విశిష్టత. ప్రగతి సంస్థ ఇప్పటికీ దిగ్విజయంగా కొనసాగడానికి ఇదే కారణం. జీవితాన్ని ఎలా జీవించాలో, దాంతో ఎలా పోరాడాలో తెలుసుకోవాలంటే ఆయన ఓ ప్రత్యక్ష ఉదాహరణ.

కేవలం పుస్తకం అచ్చువేయడంలో ఉన్నతమైన ప్రమాణాలు పాటించ డమే కాకుండా... ఆయన జీవితంలో కూడా వాటిని ఆచరించారు. అవే ఆయనను ఇంకా ఉన్నత స్థితిలోకి తీసుకెళ్లాయి. ఎంత ఎత్తుకు ఎదిగినా మూలాల్ని మరచి పోని మనిషి ఆయన. అప్పుడు ఎలా ఉన్నారో.. చనిపో యేంత వరకూ అలానే ఉన్నారు. ఓ పుస్తక ప్రచురణ సంస్థ అధినేతగా ప్రముఖుడైన 'ప్రగతి' హనుమంత రావు అంతకుమించిన మనిషి.

కృష్ణా జిల్లా దివిసీమ లో ఘంటసాల మండలానికి చెందిన చిట్టూర్పు గ్రామంలో జనవరి 16, 1921లో లో పేద రైతు కుటుంబంలో జన్మించారు.బందరు హిందూ ఉన్నత పాఠశాలలో మెట్రిక్? వరకు విద్యాభ్యాసం చేశారు. మద్రాసు పచ్చయ్యప్ప కాలేజి నుంచి బి.ఏ. పట్టా అందుకున్నారు. కమ్యూనిస్టు కార్యకర్తగా పనిచేశారు. బొంబాయి పీపుల్స్? థియేటర్?లో బలరాజ్? సహానీ వంటి ప్రముఖులతో కలిసి నాటక ప్రదర్శనలిచ్చారు. వూరూరా తిరిగి ప్రదర్శనలిచ్చి రాజకీయ ప్రచారం చేశారు. తెలంగాణా రైతాంగసాయుధ పోరాటంలో జైలుకు వెళ్లారు. కడలూరు జైలులో ఎ.కె.గోపాలన్?, మోటూరు హనుమంతరావు తదితర కమ్యూనిస్టు యోధులతో కలసి శిక్ష అనుభవించారు. మద్రాసు పచ్చయప్ప కాలేజీ లో బిఏ చదువుతూ విద్యార్థి ఉద్యమంలో పనిచేశారు. విశాలాంధ్ర దినపత్రిక లోనూ కొంత కాలం విలేకరిగా పనిచేశారు. విద్యార్థి దశ నుండి విద్యార్థి సమాఖ్యలో చురుకైన కార్యకర్తగా పనిచేశారు. చిన్నప్పటి నుండి అభ్యుదయ భావాలు ఉండటం వల్ల చండ్ర రాజేశ్వరరావు లాంటి కమ్యూనిస్టు నాయకులతో పరిచమేర్పడటంతో ఉమ్మడి కమ్యూనిస్టుపార్టీలో పార్టీ హోల్?టైమర్?గా, ఏఐఎస్?ఎఫ్? రాష్ట్ర నాయకులుగా విశేష కృషి చేశారు.

మలుపు తిప్పిన జైలు జీవితం....

1948లో బందర్?లో ఆయన ఇంటర్ చదువుతున్నప్పు డు తెలంగాణ సాయుధ పోరాట ఉద్యమంలో కీలక పాత్ర పోషించారు. ఈ కారణంగా ఆయన జైలుకు కూడా వెళ్లారు. ఆ జైలు జీవితంలోనే ఆయనకు కమ్యూ నిస్టు భావాలు మొగ్గతొడిగాయి. ఎ.కె.గోపాలన్, తరిమెల నాగిరెడ్డి లాంటి గొప్ప వ్యక్తులతో ఆయనకు సన్ని హిత సంబంధాలు ఏర్పడ్డాయి. అలా ఆయన టీనేజ్ దశే ఆయన జీవితానికి గొప్ప నాంది పలికింది అప్పుడే. నాయకుడిగా, నటుడిగా, ప్రజానాట్యమం డలి సభ్యుడిగా ఆయన గురించి చెప్పాలం టే ఒక పుస్తకమే. మద్రాసు, బొంబాయి, తమిళనాడు, ఆంధ్రప్రదేశ్ ప్రజానాట్య మండలిలో ఏకకాలంలో సభ్యత్వం ఉన్న వ్యక్తి ఈయనే. కమ్యూనిస్టు అగ్రనాయకు లందరినీ రాజస్థాన్ జైలుకు తరలించాలని అధికారులు నిర్ణయం తీసుకున్నప్పుడు దానికి వ్యతిరేకంగా హనుమంతరావు గారు ఏకంగా నెలరోజుల పాటు ఆమరణ నిరాహార దీక్ష చేశారు.

పాత్రికేయ వృత్తిలోకి.....

మా పాత్రికేయ ప్రయాణం ఒకేసారి ప్రారంభమైంది. ఆయన 'విశాలాంధ్ర' దినపత్రికలో సినిమా విలేకరిగా చేరారు. నేను 'జ్వాల' పత్రికలో పనిచేయడం మొదలు పెట్టాను. అప్పటి నుంచే మా ఇద్దరి మధ్య మా బంధం ఇంకా బలపడింది. సోవియట్ యూనియన్ నేత కృశ్చేవ్ వంటి ప్రముఖులను కూడా ఆయన ఇంటర్వ్యూ చేశారు. పాత్రికేయుడిగా ఉన్నప్పుడే తన ప్రయాణాన్ని సినీ రం గం వైపు మళ్లించారు. సారథీ స్టూడియోస్?లో ప్రొడక్షన్ మేనేజర్?గా చేరారు. 'ఎత్తుకు పైఎత్తు', 'కలిసి ఉంటే కలదు సుఖం' వంటి చిత్రాలకు పనిచేశారు. మద్రాసు నుంచి హైదరాబాద్ తరలివచ్చిన తొలితరం సినీ ఉద్యో గి కూడా ఈయనే. కానీ నెగటివ్ కొరతవల్ల చిత్ర నిర్మా ణం కుంటుపడటంతో ఆయన ఆ రంగం నుంచి నిష్క్రమించారు.

1951 నాటి రాయలసీమ కరవు సమయంలో వ్యాధులు వ్యాపించగా పాతిక మందికి పైగా వైద్యులతో కలసి ప్రజలకు అమూల్యమైన సేవలందించారు. 1956 వరకు మద్రాసులో విలేకరిగా పనిచేశారు. 1952, 1956 ఎన్నికలలో ప్రజానాట్యమండలి కళాకారుడిగా వివిధ కళారూపాల ద్వారా ప్రచారం చేశారు. 1962లో హైదరాబాద్?లో ప్రగతి ప్రెస్? స్థాపించి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్??లో దానిని అత్యుత్తమ, అత్యాధునిక ముద్రణాలయంగా తీర్చిదిద్ది పురస్కారాలు అందుకున్నారు.

1962 తర్వాత చలన చిత్ర రంగంలో తాపీ చాణక్య వంటి దర్శకుల దగ్గర పనిచేశారు. మహాకవి శ్రీశ్రీ కి సన్నిహితంగా మెలిగారు. ఆ రోజుల్లో నటించడానికి ఎవరూ ముందుకు రాకపోతే ప్రకటనలిచ్చి ఇంటర్వ్యూలు జరిపి మరీ తీసుకొచ్చారు. ముడిఫిల్మ్ కొరత సినిమా పరిశ్రమను సంక్షుభితం చేసిన దశలో ఆయన దృష్టి ముద్రణా రంగం వైపు మరలింది. ఆరు వేల పెట్టుబడితో పాత యంత్రాలతో అచ్చుపని మొదలెట్టారు.ఒక సెకండ్? హాండ్? ఆఫ్?సెట్? యంత్రం కొన్నారు. హనుమంతరావు కుమారులు నరేంద్ర మహేంద్ర ప్రగతి సంస్థను సాంకేతికంగా అభివృద్ధి పరిచారు.1979లో వారు దక్షిణ భారత దేశంలోనే తొలి సారి ఫొటో కంపోజింగు విధానాన్ని ప్రవేశపెట్టారు. ఈయనకు ఇద్దరు కుమారులు. మనుమళ్ళు హర్ష, హేమంత్?లు కూడా ఈ బృందంలో భాగస్వాములయ్యారు. అయిదు రంగుల ఆఫ్?సెట్? ముద్రణాయంత్రం కంప్యూటర్? కంట్రోల్స్?తో సహా దేశంలోనే తొలిసారిగా 1988లో ఇక్కడే ప్రవేశించింది. 1996లో స్పాట్? యువి కోటింగ్స్? కూడా అలాగే ప్రథమ పర్యాయం మొదలైంది.

ఆయన వివాహం చాలా నిరాడంబరంగా ఆ రోజులో 25 పైసలతో చేసుకొని నేటి తరానికి ఆదర్శంగా నిలిచారన్నారు. వారు వ్యాపార రీత్యా హైదరాబాద్?లో స్థిరపడ్డాక వామపక్ష పురోభివృద్ధిని కాంక్షించి, వాటి అభివృద్ధికి తన సహాయ సహకారాలు అందిచారు. సీఆర్?.ఫౌండేషన్?లో వృద్ధాశ్రమం, మహిళా సెంటర్?, మెడికల్? సెంటర్? నిర్మాణంలో, వాటి అభివృద్ధికి నిర్విరామంగా కృషి చేశారు. కాట్రగడ్డ గంగయ్య స్మాకర కమిటీ ఈ ఏడాది శాంతి స్వర్ణ పతకాన్ని హనుంతరావుకు ఆదివారమే ప్రకటించింది. ఆ పతకం స్వీకరించకుండానే ఆయన మృతి చెందారు.

దేవుడిచ్చిన చెల్లెలు.....

ఎన్టీఆర్, ఏఎన్నార్, జగ్గయ్య, సావిత్రి వంటి ప్రముఖు లతో ఆయనకు ఆత్మీయ అనుబంధం ఉండేది. ఓసారి షూటింగ్ సమయంలో సావిత్రి ఓ బాధాకరమైన సన్నివేశంలో నటిస్తున్నారు. ఆ షాట్ అయిపోగానే సావి త్రి "అన్నయ్యా అంటూ హనుమంతరావుని పట్టుకుని ఏడ్చేశారు. ఆ మహానటి నాకు దేవుడిచ్చిన చెల్లెలని ఆయన ఓ సందర్భంలో అన్నారు.

కార్మికుల ఆకలి తీరాలి!

ఓ అర్ధరాత్రి హనుమంతరావుగారు హైదరాబాద్ లోని ఓ హోటల్?కు వెళ్లారు. ఆయనప్పుడు సారథీ స్టూడి యోస్?లో పనిచేస్తున్నారు. "ఏంటండీ ఇప్పటిదాకా తిన లేదు, మీరు కావాలనుకుంటే ముందే భోజనం చేయొచ్చుకదా.. ఎందుకిలా?" అని వారిని అడిగారు. అప్పుడు ఆయన "నా కింద పనిచేసే వాళ్ల కడుపు నిండితేనే నేనూ తింటాను, ఎప్పుడైనా సరే వాళ్లు తిన్న తరువాతే తిం టాను" అని సమాధానమిచ్చారు. ఆయన మంచితనం అలాంటిది. విశిష్ట గుణం ఏమిటంటే వ్యాపారానికి మానవీయ విలువలు జోడించారు. కుమారులు నరేంద్ర, మహేంద్రలకు అవే భావాలను నూరి పోశారు. 'ప్రగతి 'సంస్థ ఇప్పటికీ దిగ్విజయంగా కొనసాగడానికి ఇదే కారణం. ప్రపంచంలో ప్రింటింగ్ టెక్నాలజీలో వస్తున్న మార్పులను దృష్టి లో పెట్టుకొని సంస్థను ఇంకా అభివృద్ధి లోకి తీసుకొచ్చారు. చంద్ర రాజేశ్వరరావు రచించిన 'గమ్యం-గమనం' పుస్తకాన్ని ఉచితంగా ప్రచురించారు.

అవార్డుల పరంపర.....

1) ప్రగతి ప్రింటర్స్‌కు మూడు సార్లు సార్లు గోల్డెన్ ఎలిఫెంట్ పురస్కారం లభించింది.
2) 1962లో రూ. 6 వేల పెట్టుబడితో ప్రగతి ప్రింటర్స్?ని ప్రారంభించారు.
3) 1985 నుంచి 2010 మధ్య ప్రగతి ప్రింటర్స్‌కు 200 జాతీయ అవార్డులు లభించాయి.
4) 1996లో దక్షిణాసియా దేశాల్లో బెస్ట్ ప్రింటర్? ఇన్ క్వాలిటీ అవార్డు
5) 2001 నుంచి 2006 మధ్య వరసగా ఆరేళ్ల ఏషియన్ ప్రింటర్ ఆఫ్? ద ఇయర్ పురస్కారం
6) 2004లో 9 కేటగిరీల్లో ప్రగతికి ఏషియన్ ప్రింట్స్ అవార్డులు
7) 2004లో ట్రేడింగ్ ప్రింటర్ ఆఫ్ ద ఇయర్ అవార్డు

2006, 2008, 2009లో ప్రగతి ప్రింటర్స్‌కు గోల్డెన్ ఎలిఫెంట్ పురస్కారం.


9) ప్యాకేజింగ్ రంగంలో సరికొత్త ఆవిష్కరణకు నాంది పలికింది ప్రగతి ప్యాక్.

మరణం....

కొద్ది కాలంగా తీవ్ర అనారోగ్యంతో బాధపడుతూ హనుమంతరావు గారు మార్చి 2, 2015 సోమవారం నాడు హైదరాబాద్ లో కన్నుమూశారు.

- మొహమ్మద్ గౌస్





# సౌందర్యం

ప్రాణికోటి మనస్సులను పరవశింప జేయడం సౌందర్యానికి గల ప్రాథమిక లక్షణం. శ్రీకృష్ణుని వేణుగానంలో రహస్యమిదే. భగవంతుడైన శ్రీకృష్ణుడు తనలోని సౌందర్యాంశను మురళీగాన రూపంలో ప్రకటితం చేసి చరాచర ప్రకృతిని సమ్ముగ్ధం చేసాడు. అది సత్యమైన సౌందర్య సృష్టి. ఆ సత్యసౌందర్య ఆస్వాదనలో ప్రేరితుడైన మానవుడు ఆ సుందరగానంలో సంలీనం చెంది ఆ వేణుగాన ప్రవాహంలో ఒక బిందువుగా మారి ఆ చైతన్యం చేత సంక్రమించిన స్ఫురణతో సౌందర్యానికి పునస్సృష్టి చేస్తాడు.

ఈ సౌందర్యం ఉదాత్తం, హృద్యం అని రెండు రకాలు. వాటిని విస్తృతంగా, ప్రత్యేకంగా వర్ణించడానికి చాలా కృషి చేశారు భాగవతకారులు.

హృద్య సౌందర్యానికి ఉదాహరణ చిన్ని కృష్ణుడి రూపం. ఆయన ప్రత్యంగ మనోహరత్వం ఏ ఇతర దేవతల్లో ఎంత వెదికినా కనిపించదు. భాగవతంలోనైనా, మరే ఇతర కృష్ణ సంబంధిత సాహిత్యంలోనైనా ఈ విషయం ప్రస్ఫుటమవుతుంది.

శైశవం, బాల్యం (రెండూ వేర్వేరు) అనగానే గుర్తు వచ్చే రూపం కృష్ణుడిదే.

దేవుణ్ని బిడ్డగా, అతడికి చేరువగా, ఆయనతో చనువుగా, ఆయన్ని సులువుగా చూసుకునే/ చేరుకునే అవకాశం బాల కృష్ణుడి రూపంలోనే వారికి సాధ్యమవుతుంది. మరే ఇతర దైవాలలోనూ ఇంత దగ్గరతనం కనిపించదు.

వామనుడి ది ఉదాత్త సౌందర్యం. ఆయన సౌందర్యాన్ని పోతన వర్ణిస్తూ– అతడు బాల్య దశలో ఉన్న పరమ శివుడో, విష్ణువో, కుబేరుడో, అగ్నియో, సూర్యుడో అయి ఉంటాడన్నాడు. పై వారంతా తేజశ్శాలురు. సౌందర్యానికి ప్రతీకలే. కాకపోతే కాస్త స్థాయి ఎక్కువ. ఆ సౌందర్యాన్ని తట్టుకోవడం అందరి వల్లా కాదు. అందరూ ఆస్వాదించే సౌందర్యం ప్రత్యేకమైంది. అదే ఉదాత్త సౌందర్యం. అది వామనుడికి ఉందని వర్ణించాడు పోతన. వామనుడి బాల్య సౌందర్యం ఎంత గొప్పదంటే– ఆయన రూపాన్ని చూసి ముగ్ధురాలైన బలిచక్రవర్తి కుమార్తె (రత్నమాల) ఈ బాలుడికి స్తన్యమిచ్చే అదృష్టం తనకు కలిగితే బాగుణ్ను కదా! అని మనసులో కోరుకుందట. ❑

# "అందరూ బాగుండాలి!"

"అందరూ బాగుండాలి!" అనేది కేవలం ఓ వాక్యం కాదు, అది ఒక దివ్య మంత్రం ! అన్ని ఇతర మంత్రాల కంటే అదే గొప్పగ పనిచేస్తుంది! ప్రయోగించి చూసినవారికి దాని యొక్క ఫలితాలు పూర్తిగా తెలుస్తాయి !!

'అందరూ బాగుండాలని అనుకోవల్సిన అగత్యం ఏమిటి..?' అంటూ ఎదురుప్రశ్న వేసే వారున్నారు. 'ఇతరుల బాగు కోరితే ఏం వస్తుంది..?' అన్నది వారు వేసే రెండో ప్రశ్న. అందరూ బాగుండాలని అనుకోవడం వెనుక ఓరహస్యం ఉంది

"సర్వేజనా సుఖినోభవంతు!" అనేది పెద్దల మాట!

ఇతరులు బాగుండాలని కోరుకునే వాడు. తానూ బాగుంటాడు !!

ప్రతి రోజూ... తనకు సంబంధంలేని మనిషి యొక్క క్షేమం కోరి హృదయ పూర్వకంగా ప్రార్థన చేసే వ్యక్తికి అదే ఆరోగ్యం, ఆనందం!

ఈ ఆరోగ్యం – ఆనందంకోసం అతడు ఎక్కడికీ వెళ్ళనక్కర లేదు. అలా ప్రార్థన చేస్తున్నపుడే ఇతని శరీరంలో మార్పులు కలుగుతాయి. మనసులో చక్కటి భావ ప్రకటనలు ఏర్పడి ధ్యానంగా మారి రోగాల్ని దూరం చేస్తాయి. లోకం క్షేమం కోరుకునే వారి బాగును భగవంతుడే చూస్తుంటాడు. నలుగురు ఇళ్ళు కట్టుకోవడానికి సహాయపడిన వ్యక్తిని చెట్టుకింద ఎవరు ఉండనిస్తారు..? నిజాయితీగా నిస్వారంగా ఉండేవారు, నలుగురి క్షేమమూ కోరే వారే ఈ లోకానికి కావాలి. వారందరి ఉమ్మడి రూపమే దివ్యశక్తి ! దాన్ని ఏ దేవుడి పేరుతో నైనా పిలుచుకోవచ్చు! ❑

**పైరు నిడిన వాని ఫల మదే సఫలంబు**
**పైరు నిడని వాడు ఫలము గనునె?**
**పైరు నిడిన వాడు బహు సౌఖ్యవంతుడౌ?**
**విశ్వదాభిరామ వినురవేమ!**

పైరు వేసి దానిని బాగా సంరక్షించిన వానికే పంట చెందుతుంది. ఏమి వేయకుండా ఊరికే కూర్చున్న వానికి పంట ఏవిధంగా దొరుకుతుంది. అదే విధంగా ఎంత చదివిన వానికైనను ప్రయత్నించనిదే జ్ఞానము రాదు.



# వృద్ధాప్యం శత్రువు కాదు



చాలా "రోగాలు" నిజంగా రోగాలు కావు : అవి "సహజ వృద్ధాప్య లక్షణాలు"! బీజింగ్ లోని ఒక ఆసుపత్రి డైరెక్టర్ వృద్ధులకు ఇచ్చిన ముఖ్యమైన సూచనలు: మీరు అనారోగ్యంతో లేరు, మీరు వృద్ధాప్యంలోకి వెళ్తున్నారు. మీరు అనుకుంటున్న చాలా "రోగాలు" వాస్తవానికి రోగాలు కావు అవి శరీరం వృద్ధాప్య దిశగా సాగుతోందని తెలిపే సంకేతాలు.

మతిమరుపు అనేది ఆల్జీమర్ వ్యాధి కాదు. ఇది వృద్ధాప్య మస్తిష్కం యొక్క స్వీయ రక్షణ విధానం. భయపడకండి. ఇది వ్యాధి కాదు, ఇది మెదడు వృద్ధాప్యం. మీరు తాళాలు ఎక్కడ పెట్టారో మరిచిపోయినా, స్వయంగా వెతికి కనుగొనగలిగితే – అది డిమెన్షియా కాదు.

నెమ్మదిగా నడవడం, కాళ్లు చేతులు బలహీనంగా ఉండడం : ఇది పక్షవాతం కాదు, కండరాల క్షీణత. దీని పరిష్కారం మందు కాదు, వ్యాయామం. కదలడం ముఖ్యం.

నిద్రలేమి వ్యాధి కాదు. ఇది మెదడు తన గడియారాన్ని సర్దుబాటు చేసుకునే ప్రక్రియ. నిద్ర శైలిలో మార్పు. అర్థంలేకుండా నిద్ర మాత్రలు తినకండి. దీర్ఘకాలం నిద్ర మాత్రలు వాడడం వృద్ధులకు పడిపోవడం, మతిమరుపు వంటి ప్రమాదాలను పెంచుతుంది. ఉత్తమ నిద్ర మందు రోజులో ఎక్కువ సూర్యకాంతి పొందడం, ఒక నియమిత జీవనశైలిని పాటించడం.

శరీర నొప్పులు రుమాటిజం కాదు – ఇది నరాల వృద్ధాప్యానికి సహజ ప్రతిచర్య. చాలా మంది వృద్ధులు చెబుతారు: "చేతులు కాళ్లు నొప్పిగా ఉన్నాయి ఇది రుమాటిజమా? లేక ఎముకల వ్యాధా?" ఎముకలు నిజంగా బలహీనమవుతాయి, కానీ 99% నొప్పులు రోగం వల్ల కావు, వృద్ధాప్య నరాల ప్రసరణ మందగించడం వల్ల నొప్పి ఎక్కువగా అనిపిస్తుంది. దీనిని కేంద్ర సెన్సిటైజేషన్ అంటారు. దీనికి మందులు కాదు, వ్యాయామం మరియు ఫిజియోథెరపీ సరైన మార్గాలు.

ఉదాహరణకు, కొంచెం ఎక్కువ కొలెస్ట్రాల్ ఉన్నవారు ఎక్కువ కాలం బతుకుతారు, ఎందుకంటే కొలెస్ట్రాల్ హార్మోన్లు మరియు కణ గోడల నిర్మాణానికి అవసరం.

వృద్ధాప్యాన్ని రోగంగా చూడకండి, మార్పును వ్యాధిగా భావించకండి.

వృద్ధాప్యం రోగం కాదు, అది సహజమైన మార్గం.

వృద్ధులు మరియు వారి పిల్లలు గుర్తుంచుకోవాల్సిన మూడు విషయాలు:

1 ప్రతి అసౌకర్యం రోగం కాదు.

2 వృద్ధులకు "భయం" అతి పెద్ద శత్రువు. పరీక్షా ఫలితాలు లేదా ప్రకటనలతో భయపడకండి.

3 పిల్లలు చేయాల్సింది తల్లిదండ్రులను ఆసుపత్రికి మాత్రమే తీసుకెళ్లడం కాదు : వారితో కలిసి నడవడం, సూర్యకాంతి లో కూర్చోవడం, తినడం, మాట్లాడటం, అనుబంధం కలిగి ఉండటం.

వృద్ధాప్యం శత్రువు కాదు : అది జీవితం అనే మరో రూపం! కానీ నిలకడ మాత్రమే నిజమైన శత్రువు! ఆరోగ్యంగా ఉండండి మనసు శాస్త్రం, ఆరోగ్య ప్రక్రియను అర్థం చేసుకోవటానికి ఇది చదవదగిన విషయమైంది.

బ్రెజిలియన్ క్యాన్సర్ నిపుణుడి ఆలోచనలు:

1 వృద్ధాప్యం 60 ఏళ్ల వయసు నుండి మొదలై 80 వరకు కొనసాగుతుంది.

2 "నాలుగవ దశ వయసు" : అంటే నిజమైన వృద్ధాప్యం : 80 నుండి 90 వరకు.

3 దీర్ఘాయుష్యం 90 నుండి మరణం వరకు ఉంటుంది.

4 వృద్ధుల ప్రధాన సమస్య ఒంటరితనం. భార్యాభర్తలు ఎప్పుడూ కలిసి వృద్ధాప్యానికి చేరుకోరు : ఎవరో ఒకరు ముందుగా వెళ్తారు.

వితంతువు లేదా వితంతుడు కుటుంబానికి భారమవుతారు. అందుకే స్నేహితులతో సంబంధాలు కొనసాగించటం చాలా ముఖ్యం. పిల్లలు, మనవలు మీతో ఉండాలని ఎంతగా ఆశించినా వారు బిజీగా ఉంటారు.

నా వ్యక్తిగత సూచన:

మీ జీవితంపై నియంత్రణ కోల్పోవద్దు : ఎప్పుడు ఎవరితో బయటకు వెళ్ళాలి, ఏం తినాలి, ఎలా దుస్తులు ధరించాలి, ఎవరితో మాట్లాడాలి, ఏం చదవాలి, ఎప్పుడు నిద్రపోవాలి : ఇవన్నీమీకు మీరు నిర్ణయించు కోవాలి. ఈ స్వాతంత్ర్యం కోల్పోతే, మీరు ఇతరులకు భారమవుతారు.

విలియం షేక్స్పియర్ అన్నాడు: "నేను ఎల్లప్పుడూ ఆనందంగా ఉంటాను! ఎందుకంటే నేను ఎవరి నుండి ఏమీ ఆశించను."

అతని భావం : ఆశ ఎప్పుడూ బాధ కలిగిస్తుంది.

ప్రతి సమస్యకు పరిష్కారం ఉంటుంది : మరణం తప్ప. ప్రతిస్పందించే ముందు... లోతుగా ఊపిరి పీల్చండి. మాట్లాడే ముందు... వినండి. విమర్శించే ముందు... మిమ్మల్ని మీరు చూసుకోండి.

రాసే ముందు... ఆలోచించండి.

దాడి చేసే ముందు... సహనం వహించండి.

మరణించే ముందు... అత్యంత అందమైన జీవితాన్ని గడపండి!


సంపూర్ణ వ్యక్తి కంటే, జీవితం ఆసక్తికరంగా, అందంగా గడపడం నేర్చుకున్న వ్యక్తితోనే మంచి సంబంధం కలిగి ఉండాలి.

ఇతరుల లోపాలను గుర్తించండి, కానీ వారి గుణాలను కూడా ప్రశంసించండి. మీకు సంతోషంగా ఉండాలి అంటే, ముందు ఎవరికైనా సంతోషం ఇవ్వాలి. మీకు ఏదైనా కావాలంటే, ముందుగా మీ నుంచి ఇతరులకు ఏదైనా ఇవ్వాలి. మంచి, స్నేహపూర్వక, ఆసక్తికరమైన మనుషులతో ఉండండి : మీరు కూడా అలాంటి వారి లాగే ఉండండి.

గుర్తుంచుకోండి:

కష్ట సమయాల్లో కూడా కన్నీళ్లు ఉన్నా, నవ్వుతూ చెప్పండి : ❑

# దక్షిణామూర్తి



దక్షిణామూర్తి అన్న పేరు శివుడికి ఎందుకు వచ్చింది? ఆ స్వరూపానికి ఉన్న విశిష్టత ఏమిటి?

దక్షిణామూర్తి : జ్ఞానాన్ని ప్రసాదించే గురువు

దక్షిణామూర్తి అనే పేరు ప్రధానంగా రెండు పదాల నుండి వచ్చింది. 'దక్షిణ' మరియు 'మూర్తి' . సంస్కృతంలో "దక్షిణ" అంటే "దక్షిణం" మరియు "మూర్తి" అంటే "రూపం" లేదా "అవతారం". అంటే, దక్షిణ దిక్కుకు అభిముఖంగా ఉన్న దైవ స్వరూపం అని అర్థం. చాలా శివాలయాలలో, దక్షిణామూర్తి విగ్రహం గర్భగుడి చుట్టూ ఉన్న దక్షిణ ప్రాకారంలో ప్రతిష్ఠించబడి ఉంటుంది.

హిందూ సాంప్రదాయంలో దక్షిణ దిక్కు, కాలం మరియు మరణానికి అధిపతిన యముడికి సంబంధించినది. మరణం మరియు పుట్టుకకు అతీతమైన జ్ఞానాన్ని ప్రసాదించేవాడు కాబట్టి, కాలానికి అధిపతి అయిన యముడిని సైతం శాసించే స్థానం నుండి జ్ఞానాన్ని అందించడానికి దక్షిణ దిశకు అభిముఖంగా కూర్చుంటాడని చెబుతారు.

ముఖ్యంగా : 'దక్షిణామూర్తి' అంటే దక్షిణం వైపు ముఖం చేసి కూర్చున్న దైవ స్వరూపం లేదా జ్ఞానాన్ని ప్రసాదించే శక్తి స్వరూపం అని అర్థం.

దక్షిణామూర్తి స్వరూపం యొక్క విశిష్టత : దక్షిణామూర్తి రూపం కేవలం ఒక విగ్రహం కాదు, అది జ్ఞానం, మౌనం మరియు ధ్యానం యొక్క సంపూర్ణ ప్రతిరూపం.

**మౌన గురువు**

దక్షిణామూర్తి యొక్క అత్యంత ముఖ్యమైన విశిష్టత ఏమంటే, ఆయన జ్ఞానాన్ని మాటల ద్వారా కాకుండా, మౌనం ద్వారా బోధిస్తాడు.

ఆయన చుట్టూ ఉన్న వృద్ధులైన నలుగురు సనకసనందాది మునులు, అన్ని రకాల సందేహాలను, జ్ఞాన అన్వేషణను మనసులో ఉంచుకుని ఆయన ముందు కూర్చుంటారు.

శివుడు కేవలం మౌనంగా, చిన్ముద్రతో కూర్చున్నంత మాత్రాన, ఆ మునుల మనస్సుల్లోని సందేహాలన్నీ తీరిపోయి, వారికి పరమ జ్ఞానం లభిస్తుంది.

ఇది 'జ్ఞానాన్ని మాటలకు అతీతంగా అనుభూతి చెందాలి' అనే సత్యాన్ని తెలియజేస్తుంది.

**గురువుల గురువు:**

దక్షిణామూర్తిని 'ఆది గురువు' లేదా 'గురువుల గురువు' అని పిలుస్తారు. సృష్టిలోని సమస్త విద్యలకు, శాస్త్రాలకు, యోగానికి మూల గురువు ఈయనే.

గురువారం రోజున, గురువును పూజించేటప్పుడు దక్షిణామూర్తిని పూజించడం అత్యంత శ్రేష్ఠమైనదిగా భావిస్తారు.

జ్ఞానం, విద్య, లలిత కళలు, సంగీతం మరియు యోగా వంటి వాటిని అభ్యసించేవారు ఈ స్వరూపాన్ని పూజించడం వల్ల అధిక ప్రయోజనం పొందుతారు.

**స్వరూప లక్షణాలు :**

చిన్ముద్ర : కుడిచేతి బొటనవేలును చూపుడువేలితో కలిపి ఉంచుతాడు. బొటనవేలు పరమాత్మకు, చూపుడువేలు జీవాత్మకు ప్రతీక. జీవాత్మ పరమాత్మతో కలిసినప్పుడు సంపూర్ణ జ్ఞానం లభిస్తుందని దీని అర్థం.

కింద పడి ఉన్న అపస్మార పురుషుడు : శివుని కుడి పాదం కింద అజ్ఞానం, అహంకారం, మరియు మాయకు ప్రతీక అయిన అపస్మార పురుషుడు అణచివేయబడి ఉంటాడు. జ్ఞానంతో అజ్ఞానాన్ని అణచివేయడం దీని ఉద్దేశం.

కూర్చునే విధానం : ఆయన సాధారణంగా ఒక వటవృక్షం అంటే మర్రిచెట్టు కింద, ధ్యాన స్థితిలో కూర్చుని ఉంటాడు. వటవృక్షం బ్రహ్మాండం మరియు దాని నుండి వచ్చే జ్ఞానానికి ప్రతీక.


నాలుగు చేతులు : సాధారణంగా నాలుగు చేతులతో కనిపిస్తాడు.

పైన కుడి చేయి : పాము లేదా ఢమరుకం ధరించి ఉంటుంది.

పైన ఎడమ చేయి : వేదాలు లేదా అగ్నిని ధరించి ఉంటుంది.

కింద ఎడమ చేయి : జపమాల లేదా పుస్తకాన్ని పట్టుకుని ఉంటుంది, ఇది జ్ఞానానికి ప్రతీక.

ఉపసంహారం : దక్షిణామూర్తి అనేది శివుడి యొక్క అంతర్ముఖ స్వరూపం. ఆయన సన్యాసులకు, విద్యార్థులకు, జ్ఞాన అన్వేషకులకు మరియు యోగులకు ఆరాధ్య దైవం. మనిషి తనలోని సందేహాలు, అజ్ఞానం అనే అపస్మారాన్ని అణచివేసి, గురువు యొక్క మౌన బోధన ద్వారా సత్యాన్ని తెలుసుకోవాలనే అత్యున్నత వైదిక సందేశాన్ని ఈ స్వరూపం తెలియజేస్తుంది. ❑



# కుటుంబ వ్యవస్థ

కుటుంబ వ్యవస్థ ఇక నిలువబడదు. త్వరలోనే కూలిపోతుందని అధ్యయనాలు చెపుతున్నాయి...

అందుకు గల కారణాలు

1. అతి తెలివి, గర్వము, డబ్బులు ఉన్నాయనే అహంకారం.

2. చిన్న తప్పులను కూడా భరించలేని అసహనం. ఓర్పు లేకపోవడం.

3. పిల్లలు, పెద్దలు కూర్చొని మనస్పూర్తిగా మాట్లాడుకోలేకపోవడం .

4. ఎక్కువ సమయం TV, ఫోన్లు, ఇతర net program లలో మునిగిపోవడం. (ఎక్కడో ఉన్న సినిమా హీరో, హీరోయిన్లు ఏం తిన్నారో, ఏం చేస్తున్నారో చెప్పగలరు కానీ, ఇంట్లో అమ్మ నాన్న ఏం తిన్నారో వాళ్ళు ఏమి చేస్తున్నారో తెలియదు)

5. చిన్న విషయాలకు అలిగి, స్వంత వారితో కూడా దూరంగా ఉండటం.

6. ఎవరో ఒకరి నోటి దురుసుతనం, కోపం వల్ల కుటుంబం అంతా చెదిరిపోవడం.

7. ఆర్థిక విషయాలలో ఇంటి పెద్దల సలహా తీసుకోకపోవడం

8. భార్యాభర్తలు, తలితండ్రులు తరుచు గొడవలు పడుతుండడంతో పిల్లలు పెళ్లి అంటే భయం కలుగుతుంది. పెళ్లి వద్దనుకునే స్థితికి వచ్చేశారు...

9. మనిషికి మరో మనిషంటే గిట్టనితనం... పెత్తనం కోసం పోరాటం. ఒంటరితనం ఇష్టపడుతున్నారు.

10. మధ్యవర్తిత్వం నడిపేవారు లేరు. ఎవరిష్టానికి వారన్నారు. మంచి చెప్పినా నచ్చటం లేదు.

11. కుటుంబ నిర్వహణ అనేది గొప్ప కళ. అది తెలియక పోవడం మరో కారణం.

12. మానవ సంబంధాలు, సున్నితత్వం మరచిపోయి, మొరటు వ్యవహారం వచ్చేసింది. భార్యాభర్తలు కలిసి కుటుంబాన్ని నడపడం మర్చిపోయారు. "నేను", "నేనే", " నేను చెపితే చేయాలి" అనే ధోరణి ప్రబలిపోయింది.

13. social media లో జరిగిందే నిజం, ఇంట్లో జరిగేది ఒక డ్రామా అన్నట్లు ప్రవర్తిస్తున్నారు.

14. ఎవరైనా మరణిస్తే ఒక ఆకర్షణీయమైన message పెట్టేసి చేతులు దులుపుకుంటున్నారు... ఇండ్లకు వెళ్లి పలకరించడం లేదు. మోయడానికి కూడా నలుగురు వచ్చే పరిస్థితి లేదు.

15. ప్రజలంతా ఎవరికి వారే అన్నట్లు, నిర్లిప్తంగా ఉండిపోతున్నారు... ప్రక్కనే గొడవలు అవుతున్నా చూస్తూ వెళుతున్నారు తప్ప, ఆపే ప్రయత్నం చేయని పరిస్థితి.

ఇదే పరిస్థితి కొనసాగితే, అతి త్వరలో కుటుంబ వ్యవస్థే కాదు, అసలు మానవ సంబంధాలు కూడా తెగిపోతాయి అనడం అతిశయోక్తి కాదేమో. ( సేకరణ)

SRI RAJARAJESWARI JEWELLERY
The Oldest Jewellery Shop in Pondy Bazaar
81, Pondy Bazar, T. Nagar, Chennai - 600 017.
Phones : 28152387, 28154653
*The Purest Treasurer Mortal Times Afford is Spotless Reputation*

రుచికి, సువాసనకి, ఆరోగ్యానికి నాణ్యమైన
"అజంతా"
వక్కపొడి
రవికుమార్ అండ్ కంపెని - చెన్నై

# విస్మయపరచే కథ !!

ఆయనను అందరూ యాజులుగారు అని పిలిచేవారు. పూర్తి పేరు తెలిసిన వారు జీవించి ఉన్నది. ఒక్కరే ! ఆవిడ నోరు తెరిచి ఆ పేరును చెప్పి దాదాపుగా ఐదు పుష్కరాలు అయి ఉంటుంది. అది కూడా పెళ్ళిలో గడపల దగ్గర అమ్మలక్కలు లోపలకి రాకుండా అడ్డం పడితే గత్యంతరం లేక సగం నమిలి సగం మింగేసి చెప్పింది. ఆ అమ్మలక్కల ఇకయికలలో ఎవరికైనా వినిపించిందో లేదో!

ఆయన వేదము, జ్యోతిషము నేర్చుకున్నాడు. అన్నిటినీ మించి తల్లి దగ్గర చిన్నతనంలో ఉపనయనం అవగానే బాల ఉపదేశం పొందాడు. ఆయన ఇల్లు కదిలేది చాలా సకృత్తు. మిగిలిన రోజులలో ఆయన సర్వస్వమూ బాలయే! తెల్లవారుఝామున లేచి కాలకృత్యాలు తీర్చుకుని బావి దగ్గర స్నానం చేసి నిత్యానుష్ఠానం, ఆ తరువాత బాల! ఎంత పునశ్చరణ చేశాడో ఆయన ఎప్పుడూ లెక్క పెట్టుకోలేదు. యధావిధిగా హోమాలు, తర్పణాలు, అన్న వితరణ లెక్కకు మిక్కిలిగా చేశాడన్నది లోకులు అత్యంత భక్తి తో చెప్పుకునేవారు. ఆయన పర్వదినాలలో సూక్ష్మ శరీరంతో ఉదయం గోదావరి తీరానికి వెళ్ళి స్నానము చేసి వస్తారని శ్రోత్రియ సమూహాలలో విస్మయాశ్చర్యాలతో చెప్పుకునేవారు.

మధ్యాహ్నం ఒంటిగంటకు మధ్యాహ్న అనుష్ఠానం పూర్తి చేసి సోమిదమ్మ గారు వడ్డించిన భోజనం క్లుప్తంగా చేసి రెండు గంటలు విశ్రమించాక బయటకు వచ్చి అరుగు మీద కూర్చుని అప్పటికే ఆయన కోసం వచ్చిన జనులకు ముహూర్తాలు, జాతకం వేసి ఇవ్వడం, పెళ్ళిళ్ళ సంబంధాల గురించి సలహాలు ఇవ్వటం, వగైరా పనులలో సమయం తెలియకుండా పొద్దు పొడిచేది. ఆయన ఎప్పుడూ ఇంత ఇమ్మని అడిగేవాడు కాదు, వచ్చిన వారు కూడా ఎంత ఇమ్మంటారని కానీ, ఇదుగో ఇంత తీసుకోమనీ ఎప్పుడూ బలవంతం చెయ్యలేదు. అవతలకు వెళ్ళి గుమ్మం దగ్గర సభక్తికంగా వారికి తోచినదేదో తాంబూలం పెట్టి అక్కడనుండి సోదెమ్మ గారికి దణ్ణం పెట్టి వెళ్లి పోయేవారు.

ఆవిడ ఆ వచ్చిన నగదు తోటో, వస్తువులతోటో సంసారం గుట్టుగా లాక్కుని వచ్చేది. వారి నలుగురు కుమారులు వారి మాతామహుల ఇంట్లో ఉంటూ నాన్నగారి బాటలోనే వేదం చదువుకుంటూ ఉండేవారు.

ఆయనకు ఉన్న ఆస్తి ఏమీ లేదనే చెప్పుకోవచ్చు. అలాగని లేదని ఎప్పుడూ చింత పడినవాడూ కాదు. సోమిదమ్మ గారు కూడా మనకి లేదే అని అనుకున్న ఇల్లాలు కాదు.

ఆ యేడాది చైత్ర శుక్ల దశమినాడు ఉదయమే ఆ గ్రామంలో కలకలం రేగింది. యాజులు గారి ఇంటికి రాచ పల్లకీ వచ్చిందని. రాజుగారి పట్ల గౌరవంతో ఎవరూ పల్లకీ చుట్టూ మూగే ఆలోచన చెయ్యలేదు పిల్లలతో సహా.

యాజులుగారు స్నానం ముగించుకుని అనుష్ఠానం ప్రారంభించబోతుండగా గడప దగ్గరనుంచి మర్యాద, అధికారం మేళవించిన గొంతుతో చేంబ్రోలు యాజులు గారు ఉన్నారా అమ్మా ? అన్న వాకబు వినిపించగా ఆయన లేచి వచ్చారు ఎవరు నాయనా ? అంటూ బయటకు అడుగు పెట్టిన యాజులు గారికి సాయుధులైన రాజభటులు, అందమైన పల్లకీ, ఆ భటులపై అధికారి కనబడడంతో కొంచెం విస్తుపోయారు.

పెద్దాపురం సంస్థానాధీశులు శ్రీ శ్రీ శ్రీ వత్సవాయ రాయ జగపతి మహారాజులుం గారి దేవేరీ, శ్రీ శ్రీ శ్రీ బుచ్చి సీతాయమ్మ బహద్దూర్ రాణీవారు తమను దర్శించడానికి వేంచేశారు. అనుమతి ఇస్తే లోపలకి వేంచేయగలరు అన్నాడు ఆ అధికారి.

రాచ మర్యాద సరిగా తెలియక పోయినా అయ్యో! తప్పకుండా రావచ్చు అని తమ దగ్గర ఉన్న చాప, దానిమీద భార్య పట్టుచీర పరిచి



ఆహ్వానించారాయన. రాణిగారు శిరసు వంచి ఇంట్లో ప్రవేశించి ఆయనను చూసి అప్రయత్నంగా రెండు చేతులూ జోడించి నమస్కరించింది. దీర్ఘ సుమంగళీ భవ అని ఆశీర్వదించారాయన.

అస్పష్టంగా వెక్కిళ్ళ శబ్దం ఆయన చెవుల పడింది.

„అమ్మా ! మీరు ఎంతో దుఃఖంలో ఉన్నారు. నా ఆశీర్వచనం తర్వాత మీ దుఃఖం బహిర్గతం అయింది. అంటే మహారాజు ఆరోగ్యం గురించి చాలా ఆవేదన చెందుతున్నారన్న మాట. నా దగ్గరకు వచ్చారంటే వైద్యులు కూడా నిస్సహాయులై ఉండాలి. కానీ మీరు మా ఇంట అడుగు పెట్టిన ముహూర్తం ఆరోగ్య కారకుడైన సూర్యభగవానుడు ఉచ్ఛదశలో ఉన్న వేళ. మహారాజు ఆరోగ్యం తప్పకుండా బాగుపడుతుంది అన్నారు. మ్లానమైన మహారాణి ముఖంలో ప్రసన్న రేఖ తాండవించింది. సంకోచం వదలి ఆయన పాదాలు అంటి నమస్కరించింది.

రెండు గంటల తర్వాత జపం ముగించి బయటకు వచ్చిన యాజులు గారు అర్ధనిమీలిత నేత్రాలతో మృత్యుంజయ మంత్రం పునశ్చరణ చేస్తున్న రాణి గారిని చూసి తృప్తి గా తలాడించారు. జపంలోకి వెళ్ళే ముందు ఆయన రాణిగారికి మృత్యుంజయ మంత్రం ఉపదేశించి, అమ్మా ! నా జపం గంట పట్టవచ్చు, నాలుగు గంటలూ పట్టవచ్చు. అంతవరకూ మీరు ఈ మహా మంత్రం మానవద్దు. నాకు నా ధ్యానంలో ప్రస్తుత సమస్యకు సమాధానం దొరుకుతుందని గాఢంగా నమ్ముతున్నాను. మాతాపితరులు పార్వతీ పరమేశ్వరులను ప్రార్థించి, జపం మొదలు పెట్టండి. నేను మళ్ళీ వచ్చిన తరువాతే, నా గొంతు విన్నాకే మీరు కనులు తెరవండి అని చెప్పారు.

సుగంధ ద్రవ్యాలు వేసిన చక్కెర నీళ్ళు త్రాగుతుండగా యాజులు గారు రాణి గారికి విపులంగా పరిస్థితి వివరించారు. తల్లీ! ఇది ఎవరు చేయించి ఉంటారు అన్న మాట వద్దు. ఉగ్ర దేవతా ఉపాసనతో పాటు శాబర మంత్ర ప్రయోగం జరుగుతోంది. నెమ్మదిగా పనిచేసే విష ప్రయోగం కూడా జరుగుతున్నది. మీరు రాజావారి శరీరం రంగులో మార్పు ఏమైనా గమనించారా ? అని అడిగిన ప్రశ్నకు రాణి ఉలిక్కి పడింది.

అవును గురువుగారూ! నేను గమనించాను కానీ, అస్వస్థత కారణంగా వచ్చినదని నాకు నేను సమాధానం చెప్పుకున్నాను. సాలోచనగా తల తాటించారు యాజులు గారు. ఎలాంటి విష ప్రయోగమైనా, దుష్ట మంత్ర ప్రయోగమైనా చల్లని తల్లి ఆ పరమేశ్వరి అనుగ్రహం ఉంటే ఏమీ చెయ్యలేవు తల్లీ! దీని కోసం సూర్య నమస్కారాలు, దుష్ట మంత్ర ప్రభావం అడ్డుకునేందుకు కాళి, ఆంజనేయుడు, లక్ష్మి నృసింహులను ప్రార్థించుదాము. మీరు ప్రతిరోజు ఈ మృత్యుంజయ మంత్రం రాజావారి దగ్గర కూర్చుని చేయండి. వారికి ఇచ్చే ఏ పదార్థం అయినా క్షుణ్ణంగా తనిఖీ చేయించండి. మండలం తిరిగేసరికి రాజావారి ఆరోగ్యం పూర్తిగా కుదుటపడుతుంది.

మీరు ఏమి చెప్తే అది చేస్తాను గురువుగారూ! మా ప్రాసాదంలో ఈ సూర్య నమస్కారాలు, జపాలు చేయించవచ్చునేమో ?

"ఒద్దమ్మా! ఈ విషయం ప్రయోగం చేయించిన వారికి తెలిస్తే మంచిది కాదు, ప్రత్యక్షంగా దాడి చెయ్యవచ్చు. నేను స్వయంగా ఇవన్నీ చేస్తాను. గోప్యత చాలా అవసరం తల్లీ!

మరి ఇవన్నీ చేయడానికి, ద్రవ్యాలు, వాటిని సేకరించుకోవడానికి ధనం అవసరం కదా ? నేను ఆ ధనం సమకూరుస్తాను.

ఒద్దమ్మా! ఈ నేలను చల్లగా పరిపాలించే ప్రభువుల కోసం, వారి ఆరోగ్యం కోసం ఆ మాత్రం చేయడం నా ధర్మం. మీరు మరేమీ ఆలోచించకుండా రాజా వారి దగ్గరకు వెళ్ళిపోండి. మిగిలిన వన్నీ అమ్మే చేయిస్తుంది.

సజల నయనాలతో మరొకసారి ఆయన పాదాలకు నమస్కరించి పల్లకీ ఎక్కారు రాణి గారు.

పట్టు పరుపు మీద ఎత్తైన బాలీసుకి ఆనుకుని అలసిన ముఖంలో కొద్దిగా చిరునవ్వుతో, రాణి గారు మంద్రంగా చెప్తున్న వివరాలను పటికబెల్లం, కుంకుమ పువ్వు, ఔషధ మూలికలు కలిసిన ఆవు పాలను త్రాగుతూ వింటున్నారు జగపతి రాయలు.

ఐతే మీ గురుదేవుల మంత్రబలం చాలా శక్తివంతమైనదని అంటారు, అంతేనా ? కొంచెం పరిహాసం, కొంత గౌరవం కలగలిపి వ్యాఖ్యానించారు ఆయన.

పరిహాసానికి కూడా వారి శక్తిని శంకించకండి ప్రభూ! మీరు ఈరోజు ఇలా మాట్లాడ గలుగుతున్నారంటే వారి భక్తి ప్రపత్తులే కారణం.

యాజులుగారు దీక్షలోకి వెళ్ళిన వారం రోజులలో రాజావారి ఆరోగ్యంలో మార్పు స్పష్టంగా కనబడింది. పదిహేను రోజులకు ఒత్తిగిలి పడుకోవడం, ఆసరాతో బాలీసును ఆనుకుని కూర్చోవడం చేశారు. ఈ మార్పులు బయటకు పొక్కనీయలేదు రాణీ గారు. నెల రోజులకు ఘన పదార్థాలు కూడా తినగలిగారు రాజావారు. నలభై రోజులు పూర్తయ్యేసరికి తనంతట తాను లేచి నడవగలిగారు. శరీర వర్ణం పూర్వపు బంగారు వన్నెలోకి వచ్చింది. నలభై రోజులు పూర్తవగానే రాణీగారు యాజులు గారికి సవివరంగా లేఖ వ్రాయించి నమ్మకమైన అనుచరుడికి ఇచ్చి పంపించారు.

రాజావారు అత్యంత గోప్యంగా గూఢచర్యం చేయించి అంతర్గత శత్రువులని గుర్తించి ఎవరికీ అనుమానం రాకుండా మట్టు పెట్టించేశారు. ఇదంతా అయేసరికి దాదాపుగా ఐదు నెలలు పట్టింది.

ఆశ్వయుజ మాసం నవరాత్రుల అనంతరం యాజులు గారి ఇంట హడావిడి మొదలయ్యింది. ఈ సారి రాణిగారికి ఆతిథ్యంలో ఏ మాత్రం లోటు రాకుండా సోమిదమ్మ గారు స్వయంగా శ్రద్ధ తీసుకుని ఇంటిని తీర్చి దిద్ది ముస్తాబు చేశారు.

రాణిగారి పల్లకీ వచ్చే సమయానికి కాళ్ళు కడుక్కోవడానికి నీళ్ళు ఇవ్వడం దగ్గర నుంచి సమస్తం ఆవిడే చూసుకున్నారు.

యాజులు గారు అనుష్ఠానం ముగించుకుని వచ్చేసరికి ఆవిడ రాణిగారికి విసనకర్రతో విసురుతూ రాణిగారు చెప్పే వివరాలు వింటున్నారు.

యాజులు గారిని చూసిన రాణిగారు మ్రాన్పడిపోయారు. బ్రహ్మ తేజస్సు ఉట్టిపడే ఆయన శరీర ఛాయ నలుపులోకి మారింది. కాని

కనులలో ఆ తేజస్సు మాత్రం అలాగే ఉంది.

అమ్మా ! రాజావారి మీద జరిగిన ప్రయోగం ఎంత జటిలమైనది అంటే దానికి విరుగుడుగా ఆ ప్రయోగాన్ని నా మీదకు త్రిప్పుకోవడం తప్ప వేరే దారి లేదమ్మా! అన్నారాయన రాణిగారి సందేహం తీరుస్తూ!

జలజల కారే కన్నీటిని తుడుచుకోవడానికి ప్రయత్నం కూడా చేయకుండా ఆ దంపతులకు కాళ్ళకి మొక్కి నూతన వస్త్రాలు బహూకరించి పల్లకీ ఎక్కారు రాణి గారు.

వారం రోజుల తర్వాత వల్లూరు కరణం గారు యాజులుగారి ఇంటికి వచ్చి రాజావారి వద్దనుంచి వచ్చిన ఫర్మానా చదివి వంద ఎకరాల భూమికి సంబంధించిన పట్టాను సగౌరవంగా అందజేశారు. విస్తుపోవడం ఆ దంపతుల వంతైంది.

**ఉపసంహారం:**

ప్రభువులు రాణి గారు వ్రాయించి తెచ్చిన దాన శాసనం పూర్తిగా చదివి, భృకుటి ముడిచి ఏమిటి రాణిగారి వితరణశీలత డెబ్బై ఎకరాలైంది? అని అడిగారు.

రాణిగారు ప్రభువుల ముఖం లో అర్థాలు వెతుకుతూ, ప్రభువుల ఆరోగ్యం, నా సౌభాగ్యం ముందు ఏదీ ఎక్కువ కాదు ప్రభూ! రాణీగా నాకున్న పరిధి ప్రకారమే డెబ్బై ఎకరాలు వ్రాయించాను అన్నది.

ఆవిడ ముఖ కవళికలు చూసి ఫక్కున నవ్వి ఆ శాసనం చేతిలోకి తీసుకుని డెబ్బైని వందగా మార్చి రాజముద్రిక వేసి తిరిగి ఇచ్చేశారాయన. పూర్ణ సంఖ్య బాగుంటుందని అనిపించింది. పరిహాసం రాణివారి మేధస్సుకి అందలేదా ? అని మళ్ళీ కలకలమని నవ్వుతున్న శ్రీ శ్రీ శ్రీ వత్సవాయ రాయ జగపతి మహారాజుగారిని సంభ్రమాశ్చర్యాలతో చూస్తూ ఉండిపోయారు రాణీ శ్రీ శ్రీ శ్రీ బుచ్చి సీతాయమ్మ బహద్దూర్ వారు. ❑

## ఉగాది ప్రసాద శ్లోకం

శతాయు వజ్రదేహాయ సర్వసంపత్ కరాయచ
సర్వారిష్ట వినాశాయ నింబకం దళబక్షణం

ఉగాదినాడు ఈ శ్లోకమును చదివి ఉగాదిపచ్చడిని తీసుకోవాలి.

శతాయుష్యం వజ్రదేహం దదాత్యర్థం సుఖానిచ
సర్వారిష్టవినాశంచ నింబకందళ భక్షణమ్॥

వేపపూతతో కూడిన ఉగాది పచ్చడిని తినడం వల్ల దేహం వజ్రసదృశమై , సర్వారిష్టాలూ తొలగిపోతాయనీ.... నూరేళ్ల సుఖంగా జీవిస్తారనీ ఈ శ్లోకం అంతరార్థం.

ఇక ఉగాది ప్రాశస్త్యాన్ని గురించి చెప్పే మరో శ్లోకం కూడా ధర్మసింధు గ్రంథంలో ఉంది:-



అబ్దాదౌ నింబకుసుమం
శర్కరామ్ల ఘృతైర్యుతమ్
భక్షితం పూర్వయామేస్యా
తద్వర్షం సౌఖ్యదాయకమ్॥

ఉగాదినాడు వేపపూత, పంచదార (బెల్లం), చింతపండు, నెయ్యితో కూడిన పచ్చడిని తింటే... రాబోయే ఏడు అంతా సౌఖ్యంగా సాగిపోతుందని దీని అర్థం.

## ప్రముఖాంధ్ర అభిమానులకు ఆహ్వానం, అభ్యర్థన!

ప్రముఖాంధ్ర గత 28 సంవత్సరాలుగా నిరాటంకంగా వస్తూనే వుంది. ఎందరో అభిమానులు ఏ పరిమాణంలో సహాయం అందించాలని ఫోన్లు చేస్తున్నారు? 'వేలు'గా ఇవ్వ అవకాశం లేని అభిమానులున్నామంటున్నారు.

అలాటి మహోదయులకు, మహా హృదయులకూ పరిమితి లేదు, పరిధి లేదు. మీ శక్తికి తగినట్లు, మీ మనసుకు తోచినట్లు సహాయ సహకారము లందచేయండి! ప్రతా ఒక్క నీటిబొట్టూ కూడితేనే ప్రవాహమవుతుందీ, జీవనదీ అవుతూంది. చేరిన ప్రతీ నీటిబొట్టునూ దాచుకొని సాగరం తిరిగి మేఘమై, మేఘం వర్షమై చినుకు చినుకుగా భువినెలా సస్యశ్యామల కోమలం చేస్తూ పంటలను పండిస్తూందో – మేమూ అలానే మీ ప్రతీ 'రూక'నూ ప్రముఖాంధ్రుల భాషా సేవకే వినియోగిస్తాం. 'ప్రముఖాంధ్ర'ను పంట పొలంగా చేసి, తెలుగు అక్షర విత్తులను పండిస్తాం. ఇదే మా వినతి! ఇదే మా అభ్యర్థన. ఇదే మా హృదయపూర్వక ఆహ్వానం. పోస్టు ద్వారా ఉత్తరాలు వ్రాసి ఉన్న డబ్బులను కూడా హరింపచేయలేం. గ్రహించండి.

**రూ. 1001, 2001, 5001, 10,001, 25,001, 50,001 మీ ఇష్టం ఎంతైనా**

ప్రముఖాంధ్ర బ్యాంక్ వివరాలు :

| | | |
|---|---|---|
| Account Name | : | PRAMUKHANDHRA |
| Account No | : | 20011102592 |
| Bank | : | BANK OF MAHARASTRA, T.NAGAR |
| IFSC Code | : | MAHB 0000450 |

**ప్రముఖాంధ్ర**
64, తంబయ్యరెడ్డి వీధి, వెస్ట్‌మాంబళం, చెన్నై – 33.
మొబైల్ : 98400 48941

# పరమార్ధ కథలు




## శ్రీశ్రీశ్రీ విద్యాప్రకాశనందగిరి స్వాముల వారు

# అంత్యకాల స్మరణ

కన్నడ దేశమందలి ఒకానొక పట్టణమున పూర్వమొక ధనికుడు కాపురముండెను. అతడు ఆగర్భశ్రీమంతుడు. పెక్కు భవనములు, క్షేత్రములు అతనికి కలవు. తాను తనకుటుంబము నివసించుటకై ఒక నాలుగంతస్తుల మేడను ప్రత్యేకించి బహుసుందరముగ నిర్మించుకొనెను. అందు సకల భోగభాగ్యములను అనుభవించుచుండెను. అతనికి ప్రాపంచిక సంపద విస్తరముగ నున్నదేకాని దైవసంపద కొంచెమైనను లేదు. భగవంతునిపై విశ్వాసమతనికి ఏమాత్రమును లేదు. భగవన్నామ ముచ్చరించుడని, పుణ్యకార్యము లాచరించుడని ఎవరెన్ని చెప్పినను అతడు లక్ష్యపెట్టక ప్రాపంచిక సంపదే తన్ను కడతేర్చునను నమ్మకము గలిగి భోగలాలసుడై, దైవవిముఖుడై కాలము గడుపుచుండెను.

కాలచక్రము వేగముగ పరిభ్రమించుచుండెను, కొంత కాలమున కతనికి వార్ధక్యము దాపురించెను. అంగములు క్రమముగ శైథిల్యము నొందజొచ్చెను. శరీరము శుష్కింపదొడగెను. ఇట్టి పరిస్థితిలో ఒకనా డతనికి తీవ్రమైన వ్యాధియు సంక్రమించెను. గొప్ప గొప్ప వైద్యులు వచ్చి చికిత్సచేయుచుండిరి. కాని వ్యాధి తగ్గుముఖము పట్టలేదు. రుగ్మత క్రమక్రమముగ అధికము కాజొచ్చెను. భిషగ్వర్యులు నిరాశను ప్రకటింప దొడగిరి. అత్తఱి ఆతని బంధువులు, ఆప్తులు అత్యవసర సమావేశము జరిపి భవనముయొక్క మూడవఅంతస్తులో పరుండి యున్న ఆ రోగిని నెమ్మదిగ క్రిందకు దించి దొడ్డిలో గల పశువుల కొట్టమునందు బరుండ బెట్టిరి.

జీవితములో ఒక్క పుణ్యకార్యమైనను చేయనివాడును, ఒక్క పర్యాయమైనను భగవన్నామమును ఉచ్చరించని వాడును, పై పెచ్చు ఎన్నియో పాపకార్యములను చేసినవాడు నగు ఈతనికి సద్గతి లభించు టెట్లు? అని బంధువర్గము తలపోసి అందులకు మార్గము నన్వేషించుచుండిరి. పూజ్యులగు మహనీయులను, గొప్ప తపస్సంపన్నులను బ్రహ్మ నిష్ఠులను, అనుభవజ్ఞులను ఈ విషయమై ప్రశ్నించిరి. "అయ్యా! మా బంధువర్గములో ఒకడు జీవితమం దేలాంటి పుణ్యకార్యమున్ను చేయలేదు, ఇపుడు వృద్ధుడై రోగగ్రస్తుడై, కాటికి కాళ్ళుజాచుకొని యున్నాడు. ఇట్టి పరిస్థితిలో అతడు తరించుటకు, సద్గతి నొందుటకు ఏదైన మార్గము కలదా?" అని వారు ఆపెద్దలను అడిగిరి. వారందలు ఏకగ్రీవముగ ఒకే ప్రత్యుత్తరము నిచ్చిరి."ఓ జిజ్ఞాసువులారా! బాల్య మందుగాని, యౌవనమందుగాని, వార్ధక్యమందుగాని, అవసానదశ యందుగాని, ఏ కాలమందైనను మనుజునకు శ్రేయము నొసంగునది దైవచింతనయే, భగవన్నామస్మరణయే"అని వారు తెలిపిరి.

ఆ వాక్యములను వినిన వెంటనే ధనికుని బంధువు లందఱును రివ్వున పరుగెత్తి రోగియొక్క మంచముచుట్టు చేరి బావగారు! మామగారు! నాన్నగారు! "నారాయణ" అనండి, "రామరామ" అనండి "కృష్ణ కృష్ణ" అనండి అని ఎన్ని పర్యాయములు బిగ్గరగా అరచినను, చెవిలో ఊదినను అతడు ఏమియు పలకలేదు. కండ్లు తెరచి ఎదుటనున్న వారిని మాత్రము చూచుచుండెను. అట్టి విపత్కర పరిస్థితి యందు బాంధవుల కేమిచేయుటకును తోచలేదు. "ఈతడు అభాగ్యుడు. కనీసము అంత్యకాల మందైనను దేవుని స్మరించు పుణ్యమునకు నోచుకొనలేదు. భగవన్నామమును ఉచ్చరించలేదు. ఎట్టి ఘోరనరకమును జెందునో" అని బంధువర్గము పరితపించుచుండ; అకస్మాత్తుగ రోగియొక్క ముఖమునుండి ఏదియో శబ్దజాలము బయల్వెడలుచున్నట్లును, అతడేదియో ఉచ్చరించుచున్నట్లును వారు కనిపెట్టిరి. తక్షణము వారు చెవులు నిక్కపొడుచుకొని అతని నోటి సమీపమునకు బోయి అతడేమి పలుకుచున్నాడో వినజొచ్చిరి. "క, క, క" అను మూడు అక్షరములయొక్క శబ్దముమాత్రము వారు వినగల్గిరి. రోగి "క,క,క" అని మాత్రము పలికి ఊరకుండెను.

వెంటనే ప్రజ్ఞావంతులగు బంధువు లందఱును ఇట్లు యోచించి 'క, క, క' అను మూడక్షరములయొక్క అర్థమేమై యుండును? ఇది ఏదైనా భగవన్నామమా? లేక దేవత లాతనికి చివరి గడియలలో ఎద్దైనా ఇట్టి మంత్రమును ఉపదేశించినారా? లేక అవి ఏవైనా గొప్ప బీజాక్షరములై యుండునా? ఒకవేళ అయియున్నచో మనము కూడ అంత్యకాలములో ఈ ప్రకారముగ క, క, క అనినచో మనకుకూడ సద్గతి లభించునుగదా! కాబట్టి దీని అంతర్య మేమియో తెలిసికొనుట మంచిది. అయితే దానిని ఇతరు లెవరును చెప్పలేరు. ఉచ్చారణ చేసిన రోగియే చెప్పగలడు అని నిర్ణయించుకొని బంధువర్గ మంతయు అతని చెవియొద్ద చేరి ఐక్యకంఠముతో "నాన్నా గారు, బావగారూ! మీరు పలికిన "క, క, క" అను మంత్రముయొక్క అర్థమేమిటి? త్వరగా చెప్పండి" అని బిగ్గఱగా అరచిరి, కాని రోగి ప్రత్యుత్తర మీయలేదు, అందరు నిరాశా పరిపూరితు లైరి.

కాని ధైర్యము వీడక వారందఱు తత్‌రీతిజిజిక్షణమే ఆ పట్టణములో గొప్ప ప్రాక్టీసు కలిగి పేరుమ్రోగినట్టి ఒక డాక్టరునొద్దకు వెళ్ళి

"మహాప్రభో! మహాశ్రీమంతుడైన మాబంధువొకడు చివరి ఘడియలలో ఏదియో బీజాక్షరములు పలికినాడు, బహుశా దేవతలు బోధించిన మంత్రమేమో అది. దాని అర్థము తెలిసికొనవలెనని మేమందరము కుతూహలాయత్త చిత్తులమై యున్నాము. అతడు నోరు తెరచి మాట్లాడుటలేదు. ఇంకను కొద్దిక్షణములు మాత్రమే అతనికి మిగిలియున్నది. తమరు దయచేసి ఏదైన పటుతరమైన, మహాశక్తివంతమైన ఇంజక్షన్‌దీతిజిజి అతనికి ఇచ్చి కొంచెం మాట్లాడునట్లు చేసితిరా, మీ ఋణము మేము తప్పక తీర్చుకొన గలము," అని చెప్పిరి.

తోడనె డాక్టరు తన మందులపెట్టెను చంకనిడుకని స్టెతస్కోపును మెడలో ధరించి కారులో హుటాహుటి రోగియొద్దకు పయనమయ్యెను. రోగిని సమీపించి, నాడి పరీక్షించి ఇంకను స్పృహ ఉన్నరు పలికి సద్యఃఫలితము నొసంగు అద్భుతమగు ఇంజక్షన్‌దీతిజిజి ఒకటి ఇచ్చెను వెంటనే ఫలితము చేకూరినది. రోగి కదలజొచ్చెను. మాట్లాడ సాగెను.

ఇదియే అదను అని తలంచి బంధువు లందఱును ఆతని చుట్టుచేరి "నాన్నగారూ! మీరు పలికిన క, క, క అను మంత్రము యొక్క బాష్యం కొంచెం సెలవివ్వండి" అని ప్రార్థించిరి. వెంటనే అతడు "కరు కసబరికయన్ను కడియుత్తదే" అని తానుచ్చరించిన బీజాక్షరములయొక్క వివరణమును తెలియజేసెను. దాని అర్థమేమనగా దూడ చీపురుకట్ట తినివేస్తున్నది కాబట్టి దానిని తీసి జాగ్రత్త చేయండి అని అతడు కన్నడ దేశస్థుడు కాబట్టి కన్నడభాషలో చెప్పెను. పసువుల కొట్టములో అతనిని పరుండబెట్టినందున అతని దృష్టి చీపురుకట్ట కొరికి వేయుచున్న దూడపై ప్రసరించగా పై వాక్యము నుచ్చరించెను. అంత్య కాలమున అతనిని తాను సంపాదించిన కొలది ధనము వదలిపోవు చున్నది. సుందరభవనము వదలిపోవుచున్నది. భార్య, బిడ్డలు వదలిపోవు చున్నారు. సమస్త భోగభాగ్యములు, సంపదలు వదలిపోవుచున్నవి. ఇది యంతయు పోవుచున్నప్పటికి ఒక్క చీపురుకట్ట పోవుచున్నదే అను దిగులు అతనికి పట్టినది! ఎంత హాస్యాస్పదమైన విషయము! ఎంత శోచనీయమైనదశ! తన్నుచ్చరించినవారిని కడతేర్చునట్టి సర్వేశ్వరుని విస్మరించి, పవిత్రమైన భగవన్నామమును స్మరింపక అంత్యకాలములో తుచ్ఛమైన ప్రపంచ వస్తువులనే తలంచుకొనుచు అందును హీనతరమైన ఒకానొక అల్పవస్తువును (చీపురును) భావించుచు ఆ ధనికుడు జీవితమును వ్యర్థపఱచుకొనెను.

" జతస్మాత్సర్వేషుకాలేషు మామనుస్మరజ" అని భగవానుడు పలికినట్లు జీవితమందెల్ల వేళలందును దైవస్మరణ చేయుచు పవిత్ర భావనలను గలిగియుండు వానికే అంత్యకాలమునగూడ అట్టి నిర్మల భావములు వచ్చుచుండును. కాబట్టి ప్రతివారును తమ జీవితమందలి ప్రతి ఘడియకూడ మహామూల్యవంతమని గ్రహించి, భగవచ్చింతన యందును పరోపకారమందును, పుణ్యకార్యాచరణయందును దానిని వినియోగించుచు పవిత్రసంస్కారమును ఏర్పరచుకొనినచో అంత్య కాలమందును అట్టి ఉత్తమభావనలే జనింప. భగవత్సాన్నిధ్యము జేరి జీవితమును ధన్యమొనర్చుకొనగలరు.

నీతి:- జీవితకాలముంతయు దైవభావన గలిగియుండినచో అంత్య కాలమున అట్టి పవిత్రదైవభావమే కలిగియుండి తరింతుము. ❑

# వేదాంత తత్త్వజ్ఞానం

వేదాంత తత్వాన్ని అర్థం చేసుకోవడానికి, ఒకరు దానికి తనను తాను సిద్ధం చేసుకోవాలి. దానికి అర్హత లేని వ్యక్తికి, బోధన అతనికి ప్రయోజనం కలిగించదు. దీనికి విరుద్ధంగా, అది వ్యతిరేక ప్రభావాన్ని చూపుతుంది.

ఒక అజ్ఞాని లేదా సగం చదువుకున్న వ్యక్తికి ప్రతిదీ బ్రహ్మమే అని బోధిస్తే, అతను దానిని తప్పుగా అర్థం చేసుకోవడమే కాకుండా, ఆ బోధన అతన్ని తప్పుడు చర్యల ద్వారా నరకానికి కూడా దారి తీస్తుంది. కాబట్టి, తత్వాన్ని స్వీకరించడానికి ఒకరు అర్హత కలిగి ఉండాలి.

అప్పుడు ఆ అర్హత ఏమిటి? గ్రంథాలు మరియు గురువు బోధనలపై అచంచలమైన విశ్వాసం, ప్రాపంచిక విషయాలపై భ్రమ, కోరిక లేకపోవడం మరియు ప్రభువు పట్ల అసాధారణ భక్తి ఒకరిని యోగ్యులను చేస్తాయి.

కాబట్టి, మొదట ఈ లక్షణాలను అభివృద్ధి చేసుకోవాలి. ఈ ప్రయత్నంలో ఒకరు విజయం సాధించి తనను తాను సిద్ధం చేసుకున్నప్పుడు మాత్రమే, అతనికి వేదాంత తత్వాన్ని బోధించగలరు.

పురాతన కాలంలో, ఒక వ్యక్తి తాత్విక బోధన కోసం గురువును సంప్రదించినప్పుడు, గురువు అతను సిద్ధంగా ఉన్నాడో లేదో చూడటానికి అతన్ని పరీక్షించి, అతను సిద్ధంగా ఉన్నాడని సంతృప్తి చెందిన తర్వాత మాత్రమే అతనికి బోధన ఇచ్చేవాడు.

ప్రశ్నోపనిషత్తులో, ఆరుగురు శిష్యులు (సుశేఖర, సత్యకామ మరియు మరికొందరు) బోధనలలో దీక్ష కోసం గురు పిప్పలధరుడు ని సంప్రదించారు. కానీ గురువు తన వద్దకు వచ్చే ముందు ఒక సంవత్సరం తపస్సు చేయమని వారిని ఆదేశించాడు. కారణం ఏమిటంటే, వారు బోధనలకు పూర్తిగా సిద్ధంగా ఉన్నారని నిర్ధారించుకోవాలనుకున్నాడు. ఒక సంవత్సరం తర్వాత, గురువు వారికి బోధనలు ఇచ్చాడు. వారు కూడా తత్వాన్ని బాగా అర్థం చేసుకుని విముక్తి పొందారు.

కాబట్టి, తత్వశాస్త్రం నేర్చుకునే ముందు, అన్ని అవసరాలను సరిగ్గా పరిగణించి, అవసరమైన అర్హతలను పొందిన తర్వాత గురువు నుండి వేదాంత బోధనలను తీసుకోవడం సరైనది. దీని ద్వారా, ప్రతి ఒక్కరూ దోషరహిత జీవితాన్ని గడపవచ్చు.

– జగద్గురు శంకరాచార్య శ్రీశ్రీశ్రీ భారతీతీర్థ మహాస్వామి వారు

❑

# పిల్లల కథలలో ఆధ్యాత్మికత !



**ఈ క్రింది కథలలో ఇంతటి ఆధ్యాత్మికత దాగి ఉందా అని సంభ్రమాశ్చర్యాలకు గురయ్యాను. మన పెద్దలు ఇంతటి బుల్లి బుల్లి కథలలో ఎంతటి అర్థాన్ని ఇమిడ్చారో. ఇంతటి చక్కటి విశ్లేషణ నేనెక్కడా వినలేదు . మీతో పంచుకోవాలని పించింది.**

ఎవరు వ్రాశారో కానీ, మన చిన్నప్పటి 'రాజుగారి ఏడుగురి కొడుకులు – ఏడు చేపలు' కథకు ఎంత గొప్పగా ఆధ్యాత్మిక అన్వయం చేశారో!

వారి ప్రతిభకు నమోవాకాలు.

రాజుగారు అంటే మనిషి

ఆయనకు ఏడుగురు కొడుకులు అంటే మనిషిలోని సప్తధాతువులు.

కొడుకులు వేటకు వెళ్ళడమూ అంటే, మనిషి జీవితాన్ని కొనసాగించడం.

జీవితమే ఒక వేట. వేటే ఒక జీవితం.

రాజ కుమారులు వేటాడిన ఏడు చేపలు అంటే.

మనిషికి ఉండే అరిషడ్ వర్గాలు ( అనగా 6 )

1.కామ 2.క్రోధ 3.లోభ 4.మోహ 5.మద 6.మాత్సర్యాలు.

వీటన్నింటిని మనిషి సాధన చేసి ఎండగట్టవచ్చు, అంటే పూర్తిగా నియంత్రించవచ్చు.

అందుకే కథలో ఆరు చేపలను మాత్రమే ఎండగట్టినట్టు చెప్పారు.

రాజుగారి కొడుకులు ఎండబెట్టిన ఏడు చేపల్లో ఒక చేప ఎండలేదు.

ఏమిటా చేప. అది మనస్సు.

దీన్ని జయించడం చాలా కష్టం.

ఎంత ప్రయత్నించినా అది ఎండదు.

మనస్సు అంటే ఏమిటి

మనస్సు అంటే సంకల్ప వికల్పాలు

ఒకటి తీరుతుంటే మరొకటి మొలుచుకొస్తుంది.

మొలిచే కోరికలను తీర్చుకుంటూ పోతుంటే జీవితకాలం చాలదు.

కోరికలన్నింటిని జయించేసి, మోక్షానికి వెళ్ళిపోవాలని ప్రతి ఒక్కరూ ఆరాటపడుతుంటారు.

మోక్షానికి వెళ్ళాలనుకోవడం కూడా ఒక కోరికే.

ఆ కోరికను ఎండగడితే తప్ప మోక్షం రాదు.

ఈ చేప ఎండకుండా అడ్డు తగులుతున్నది ఏదిగడ్డిమేటు.

గడ్డిమేటు అంటే ఏమిటి?

కుప్పపోసిన అజ్ఞానం

గడ్డిమేటులా పేరుకుపోయిన అజ్ఞానాన్ని తొలగించాలంటే ఎలా?

మామూలు గడ్డికుప్ప అయితే గడ్డిపరకలను పట్టి లాగి, పీకి ఒకనాటికి ఖాళీ చేయవచ్చు.

కానీ అజ్ఞానం అలాంటిది కాదు. జ్ఞానాదాయకమైన మాటలు ఎంత చెప్పినా, ఎన్ని చెప్పినా, ఎన్నిసార్లు చెప్పినా, మనం గడ్డిపరకలను పీకినట్టే.

ఆ కుప్ప తరిగేది కాదు, తగ్గేది కాదు.

దాన్ని ఎంత ప్రయత్నించినా తగ్గించడం కష్టం.

మరి అది పోవాలంటే ఏం చేయాలి

ఆవు వచ్చి మేయాలి.

ఆవు ఎక్కడి నుంచి రావాలి. అసలు ఆవు అంటే ఏమిటి

ఆవు అంటే జ్ఞానం.

జ్ఞానం అనే ఆవు దొడ్లో ఎగబడి మేస్తే అజ్ఞానం అనే గడ్డికుప్ప ఒకనాటికి అంతరించి పోతుంది.

లేదూ... జ్ఞానాన్ని అగ్నికణంగా మార్చి గడ్డిమేటుపై వేస్తే కాలి బూడిదవుతుంది.

అందుకే భగవద్గీతలో మన కర్మలు, వాటి ఫలితాలు జ్ఞానాగ్నిలో దగ్ధమైపోవాలని చెబుతాడు కృష్ణుడు (జ్ఞానాగ్నిదగ్ధకర్మణాం)

జ్ఞానాన్ని అగ్నిగా మలుచుకోగలిగిన వాడు సిద్ధపురుషుడు, యోగ పురుషుడు మాత్రమే.

ఈ గోవును ఎవ్వరు మేపాలి.

గొల్లవాడు మేపాలి. ఆ గొల్లవాడు ఎవరు

సమర్థ సద్గురుడు, జగద్గురుడు.

జ్ఞానరూపమైన భగవద్గీతను లోకానికి ప్రసాదించిన కృష్ణుడు గొల్లవాడే కదా!

అర్జునుడు అనే దూడను అడ్డు పెట్టుకుని వేదం అనే ఆవు పాలు పిండి జ్ఞానరూపంగా మనందరికి ధారపోశాడు.

ఇంత గొప్పపని చేయవలసిన ఈ గొల్లవాడు ఆ పని చేయలేదు.

ఏమిరా నాయనా, ఆవును ఎందుకు మేపలేదు అని అడిగితే అమ్మ అన్నం పెట్టలేదు అన్నాడు.

ఇంతకీ ఆ గొల్లవాడికి అన్నం పెట్టాల్సిన అమ్మ ఎవరు

అమ్మల గన్న అమ్మ ముగ్గురమ్మల మూలపుటమ్మ చాల పెద్దమ్మ. ఆమెనే లోకం జగన్మాత అని కీర్తిస్తుంది.

ఈ జగన్మాత అన్నం పెట్టక పోవడం వల్ల గొల్లవాడి ఆకలి తీరలేదు.

ఓ జగన్మాతా ఈ గొల్లవాడికి ఎందుకు అన్నం పెట్టలేదమ్మా అంటే ఆవిడ పిల్లవాడు ఏడ్చాడు అంది.

ఇంతకి ఆ పిల్లవాడు ఎవరుఆర్తితో దైవానుగ్రహం కోసం అలమటించేవాడు.

ఈ పిల్లవాడు ఎందుకు ఏడుస్తున్నాడు

వాడికి చీమ కుట్టింది. ఎక్కడిది చీమదానికి ఇంకోపేరే సంసారం.

సంసారం అనే చీమ కుట్టినందుకు ఆ పిల్లవాడు ఏడుస్తున్నాడు.

ఆవులను మేపడానికి వచ్చే గొల్లవాడికన్నా ఆర్తితో దైవానుగ్రహం కోసం ఏడ్చే పిల్లవాడే ముఖ్యం కనుక ఆ పిల్ల వాడినే చూసుకుంది. మరి గొల్లవాడు అమ్మ అన్నం పెట్టక పోవడం వలన తన విధిని నిలిపి వేసాడా. లేదు. అమ్మ ద్వారా తన పనిలో భాగమైన శిష్ట రక్షణను చేసుకున్నాడు.

చీమకుట్టినందుకు కథలో పిల్లవాడు ఏడ్చినట్టే సంసార బాధలు, ప్రపంచ బాధలు భరించలేక మనం కూడా ఏడుస్తున్నాం, మనల్ని ఈ బాధలే చీమలై కుదుతున్నాయి.

చీమలు పుట్టలోనే ఉంటాయి... ఏమిటీ ఈ పుట్ట

మనిషికి ఉండే సంసారం ఒక పుట్ట.

ఈ పరమార్థాన్ని చెప్పడం కోసమే జీవితంలోకి అడుగు పెట్టే ముందే ఈ గొప్ప విషయం తెలియాలనే సదుద్దేశంతోనే మన పెద్దలు

ఈ కథను ప్రతి పిల్లవాడికి నూరిపోశారు. ❑

## తొమ్మిది విషయాలను కాపాడుకోవాలి

"ఆయుర్విత్తం గృహచ్ఛిద్రం మంత్రౌషధ సమాగమః

దాన మానౌమానశ్చ నవగోప్యానియత్నతః"

సారాంశం.

ఈ తొమ్మిది విషయాలను ఎల్లప్పుడూ ఇతరులకు తెలియకుండా జాగరూకతతో కాపాడుకోవాలి.

వివరణ

**1. "ఆయు"** : వయస్సు/ఆయుష్షుమీ నిజమైన వయస్సును లేదా మీ ఆయుష్షు ఎంత ఉందో ఇతరులకు చెప్పకూడదు. ఇది శత్రువులకు మీ గురించి తెలుసుకోవడానికి అవకాశం ఇస్తుంది.

**2. "విత్తం - ధనం/ఆస్తి" :** మీ దగ్గర ఉన్న సంపద లేదా ఆర్థిక స్థితిని గురించి ఇతరులకు వివరంగా చెప్పకూడదు. ధనం గురించి చెబితే ఇతరుల దృష్టి పడుతుంది, లేదా సమస్యలు రావచ్చు.

**3. "గృహచ్ఛిద్రం" :** ఇంటి లోని లోపాలు/కలహాలు" మీ ఇంట్లో జరిగే గొడవలు, లోపాలు, కుటుంబ సమస్యలు, రహస్యాలు ఇతరులకు తెలియజేయకూడదు.

**4. "మంత్రం"** : మీరు జపించే మంత్రం యొక్క శక్తి ఇతరులకు చెప్పడం ద్వారా తగ్గిపోతుంది. మీ వ్యక్తిగత సాధనను రహస్యంగా ఉంచాలి.

**5. "ఔషధం మందు"** : మీరు వాడుతున్న లేదా తయారుచేస్తున్న మందుల గురించి వివరంగా చెప్పకూడదు

**6. "సమాగమ"** : మైథునం/లైంగిక సంబంధం" వైవాహిక జీవితంలోని లేదా వ్యక్తిగత సంబంధంలోని అంశాలు.

**7. "దానం"** : దానగుణం" మీరు చేసిన దానం గురించి గొప్పగా చెప్పుకోకూడదు. చేసిన దానం రహస్యంగా ఉంచితేనే దానికి పూర్తి ఫలం దక్కుతుంది.


**8. "మానం - గౌరవం/మర్యాద" :** మీకు లభించిన గౌరవం, ప్రశంసల గురించి అతిగా ఇతరులకు చెప్పకూడదు.

**9. "అవమానశ్చ"** : అవమానం" మీకు జరిగిన అవమానాన్ని ఇతరులకు చెప్పకూడదు. అలా చెప్పడం వలన మీరు మరింత అపహాస్యం పాలయ్యే అవకాశం ఉంది. ❑


గోపురం
పసుపు పొడి
మరియు కుంకుమ
Turmeric
POWDER
GOPURAM
TRADE MARK
GOPURAM
KUMKUM
Y.V.S. & CO., MADRAS.
VISIT US AT
Website : www.gopuramproducts.com
Email : yvs@gopuramproducts.com

KCP
CEMENT
*BUILT TO LAST*

KCP
Super Sreshtaa
THE NEW GENERATION CEMENT




# THE KCP LIMITED

## BUILDING THE NATION SINCE 1958

**Registered Office:"Ramakrishna Buildings" No.2 Dr.P.V.Cherian Crescent, Egmore, Chennai-600008 Tel:+9144-66772600-67,**
**Cement Marketing Head Quarters: Plot No. 10, Gayatrihills, MLA & MPs Colony, Road No. 10 C, Jubileehills, Hyderabad-500033,**
**Tel: 040-23253503 - 510, Cell: 9989597775, Mail: ceo.cb@kcp.co.in, CIN L65991TN1941PLC001128**
cement.kcp.co.in WhatsApp : 6309909109